ప్రజాశక్తి

సోమవారం 14 అక్టోబర్ 2024 8 పేజీలు

గుంటూరు

పల్నాడు

దిగిరాని ధరలు

- అదనపు ఎంఆర్‌పితో మాయాజాలం
- నిత్యావసర వస్తువులపై కొరవడిన నియంత్రణ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

నిత్యావసర వస్తువుల ధరలపై అధికారులకు నియంత్రణ కొరవడింది. వివిధ రకాల నిత్యావసర వస్తువుల ధరల గత కొంత కాలంగా గణనీయంగా పెరుగుతున్నాయి. గుంటూరు, పల్నాడు జిల్లాల్లో ప్రధానంగా పప్పుల ధరలు గత నెల రోజుల్లో భారీగా పెరిగాయి. కందిపప్పు ధర రూ.160కి తగ్గడం లేదు. ప్రభుత్వం రూ.150కి అమ్మాలని మాల్స్‌పై వత్తిడి చేసి బోర్డులు పెట్టించి సాధారణ రకం రూ.150కి విక్రయించేలా చేసింది. కానీ తరువాత కంది పప్పు ధర కిలో రూ.130కి తగ్గినా ధర రూ.150 యథాతథంగా కొనసాగించారు. నూనెల ధరలు భారీగా పెరిగాయి. నూనె ప్యాకెట్ల ధరలు విక్రయించాల్సిన ధర కంటే అధికంగా విక్రయించినా అధికారులు ఏమి చేయలేకపోతున్నారు. సంబంధిత కంపెనీలే ముందస్తుగా అదనంగా ఎంఆర్‌పి ధర ముద్రించడం వల్ల ధర మార్కెట్‌లో వస్తున్న మార్పులకు అనుగుణంగా ధర తగ్గించాల్సి ఉన్నా యథాతథంగా పెంచిన ధరలకే విక్రయిస్తున్నారు.

ఇటీవల సన్ ఫ్లవర్ ఆయిల్ ప్యాకెట్లపై కేంద్ర ప్రభుత్వం దిగుమతి సుంకం 20 శాతం పెంచింది. ప్రజలు ఎక్కువగా వినియోగించే పామాయిల్, సన్‌ఫ్లవర్, వేరుశనగ నూనెల ధరలలో పెరుగుదల కొనసాగుతోంది. గతంలో ▸ 2లో

రాజధాని నిర్మాణంలో స్థానికులను భాగస్వామ్యం చేయాలి

- ఇసుకను అందుబాటులోకి తెచ్చి కార్మికులకు ఉపాధి కల్పించాలి
- భవన నిర్మాణ కార్మిక సంఘం డిమాండ్

ప్రజాశక్తి - తుళ్లూరు

ఇసుకను అందుబాటులోకి తెచ్చి కార్మికులకు ఆదుకోవాలని, రాజధాని అమరావతి నిర్మాణంలో స్థానికులైన భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని ప్రభుత్వాన్ని భవన నిర్మాణ కార్మిక సంఘం (సిఐటియు) జిల్లా కార్యదర్శి డి.లక్ష్మీనారాయణ కోరారు. తుళ్లూరు ఏరియా భవన నిర్మాణ కార్మిక విస్తృత సమావేశం మండల కేంద్రమైన తుళ్లూరులోని ప్రజాసంఘాల కార్యాలయంలో ఆదివారం జరిగింది. సమావేశానికి ఏరియా భవన, నిర్మాణ కార్మిక సంఘం కార్యదర్శి ఎస్‌కె నాగులు అధ్యక్షత వహించారు. లక్ష్మీనారాయణ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఇసుక సరిగా సరఫరా అవ్వక భవన నిర్మాణ కార్మికులు అనేక ఇబ్బందులు పడ్డారని చెప్పారు. అయితే తమ ప్రభుత్వం వస్తే ఉచితంగా ఇసుకను ఇస్తామని కూటమి నాయకులు హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఆచరణలో ఇప్పటికీ కార్మికులకు ఇసుక అందుబాటులో లేక పనులు లేకుండా పోయాయని ఆవేదన వెలిబుచ్చారు. భవననిర్మాణ కార్మికులు పనుల్లేక, కుటుంబాలు గడవక ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. రాజధాని నిర్మాణంలో స్థానిక భవన నిర్మాణ కార్మికులను భాగస్వామ్యం చేయాలన్నారు. సిఐటియు రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం.భాగ్యరాజు మాట్లాడుతూ భవన నిర్మాణ సంక్షేమ బోర్డును గత ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని, దానిని వెంటనే పునరుద్ధించాలని డిమాండ్ చేశారు. సిఐటియు రాజధాని డివిజన్ అధ్యక్షులు ఎం.రవి మాట్లాడుతూ బయట ఎక్కడి నుంచో కార్మికులను తీసుకొచ్చి పని చేయిస్తున్నారని, స్థానికులకు ఉపాధి లేకుండా పోతోందని అన్నారు. ఒకపక్క పొలాలు లేక, చేయటానికి పనులు లేక స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని, రాజధాని నిర్మాణాల్లో స్థానికులకే ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు.సమావేశంలో భవనిర్మాణ కార్మిక సంఘం నాయకులు చెంచయ్య, కొండయ్య పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న దండా లక్ష్మీనారాయణ

ఆటోరంగాన్ని కాపాడుకోవడానికి పోరాటాలు

ఐక్యంగా ఉద్యమిస్తేనే సమస్యలకు పరిష్కారం - ట్రాలీ ఆటో వర్కర్స్ యూనియన్ సమావేశంలో నాయకులు

ప్రజాశక్తి-సత్తెనపల్లి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాల కారణంగా ఆటో రంగం తీవ్ర సంక్షోభంలోకి నెట్టబడిందని, ఈ నేపత్యంలో ఆటో కార్మికులు ఐక్యంగా పోరాడి సమస్యలను పరిష్కరించుకోవాలని రైతుసంఘం రాష్ట్ర కమిటీ మాజీ సభ్యులు గద్దె చలమయ్య పిలుపునిచ్చారు. చేయూత ట్రాలీ ఆటో వర్కర్స్ యూనియన్ సమావేశం డివిజన్ అధ్యక్షులు ఎన్.రాజేంద్ర అధ్యక్షతన స్థానిక సిఐటియు కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఆల్ ఇండియా రోడ్ ట్రాన్‌పోర్ట్ వర్కర్స్ యూనియన్ పల్నాడు జిల్లా కార్యదర్శి ఎం.హరిపోతురాజు మాట్లాడుతూ ప్రభుత్వ విధానాలతోనే కాకుండా స్థానికంగా ఉండే సమస్యలపైనా కార్మికంగాలు ఉద్యమించాలని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అనుసరిస్తున్న విధానాల వల్ల వస్తున్న ఇబ్బందులపై చర్చించేందుకు ఈనెల 19, 20 తేదీల్లో నంద్యాలలో రాష్ట్రస్థాయి క్లాసులు ఉంటాయని, సభ్యులంతా హాజరవ్వాలని కోరారు. మోటార్ వాహన రంగాన్ని అనేక సమస్యలు పట్టిపీడిస్తున్నాయని, పార్కింగ్ సమస్య, అధిక పెనాల్టీలు, ఫైనాన్స్ సంస్థల వేధింపులు తదితరాలు ప్రధానమైనవని చెప్పారు. ఈ సమస్యల పరిష్కారం కోసం భవిష్యత్తులో పెద్ద ఎత్తున పోరాడాలని పిలుపునిచ్చారు. సమావేశంలో యూనియన్ డివిజన్ కార్యదర్శి ఎ.వెంకట్, కె.చిన్నమల్లయ్య, నాగేశ్వరరావు, జి.ఇమ్మానియేలు, జి.సాంబశివరావు, టి.వెంకట్రావు పాల్గొన్నారు.

భూమి పోయి.. వలసపోతూ..

- దుర్భరంగా యడవల్లి ఎస్సీ రైతుల దుస్థితి
- మైనింగ్ పేరుతో భూములను లాక్కున్న గత ప్రభుత్వం
- పొట్టకూటి కోసం మైసూరుకు వలసలు

4 లో

మద్యం దుకాణాలకు నేడు లాటరీ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

మద్యం షాపులకు దరఖాస్తు చేసుకున్న వారి వివరాలతో సోమవారం ఉదయం ఏడు గంటలకు వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో లాటరీ నిర్వహిస్తున్నట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో లాటరీ అత్యంత పారదర్శకంగా జరుగుతుందని చెప్పారు. పల్నాడు జిల్లా నరసరావుపేట టౌన్ హాలులో ఉదయం ఏడు గంటలకు లాటరీ ఉంటుందన్నారు. గుంటూరులో ▸ 2లో

ఉత్తమ సాంఘిక నాటిక బహుమతి గెలుచుకున్న చిగురు మేఘం నాటకంలో సన్నివేశం

కళల కాణాచికి వన్నెతెచ్చిన నాటకోత్సవాలు

8 లో

ముగిసిన వీణ అవార్డ్స్ జాతీయస్థాయి నాటకాలు - ఎడ్ల గోపాలరావుకు సుబ్రహ్మణ్య శాస్త్రి పురస్కారం

బస్సును ప్రారంభించిన అనంతరం అందులో ప్రయాణిస్తున్న ఎమ్మెల్యే అరవిందబాబు

రెండు కొత్త బస్సులను ప్రారంభించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ప్రయాణికుల సౌకర్యార్థం నరసరావుపేట ఆర్టీసీ డిపో నుంచి మరిన్ని కొత్త బస్సు సర్వీసులు నడిపేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. నరసరావుపేటలోని ఆర్టీసీ డిపోలో రెండు కొత్త బస్సులను ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. రానున్న రోజుల్లో మరిన్ని కొత్త సర్వీసులు తీసుకొస్తామన్నారు. ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ఆర్టీసీ అధికారులను కోరారు. ప్రయాణికులు అధికంగా ఉన్న ప్రాంతాల్లో ఆర్టీసీ బస్సులు నడపాలని, ఇబ్బందులు లేకుండా నిత్యం పర్యవేక్షించాలని సూచించారు. ప్రజలు ఆర్టీసీలోనే ప్రయాణించి ఆదరించాలని కోరారు.

దిగిరాని ధరలు

(మొదటి పేజీ తరువాయి)

రూ.100 ఉన్న పామాయిల్ రూ.125కి పెరిగింది. వేరుశనగ నూనె ధర రూ. రూ.140 నుంచి రూ.150 వరకు విక్రయిస్తున్నారు. ఫ్రీడం సన్ ఫ్లవర్ అయిల్ ధర రూ.115 నుంచి రూ.150కి పెంచారు. దిగుమతి సుంకం ధరల పెరుగుదలతో నూనెల ధరలు భారీగా పెంచారన్న సమాచారంతో ప్రభుత్వ తన నిర్ణయంపై సమీక్షించింది. తిరిగి యథాతథ స్థితిని తీసుకువచ్చేందుకు దిగుమతి సుంకాన్ని మళ్లీ కొంత తగ్గించింది. వెంటనే ఆయిల్ ప్యాకెట్ల రేట్లను తగ్గించాలని ప్రభుత్వం వత్తిడి తెచ్చినా వ్యాపారులు ధరలు తగ్గించలేదు. ప్రస్తుతం ఫ్రీడమ్ నూనె ప్యాకెట్ల ధరలు రూ.132 నుంచి రూ.145కి విక్రయిస్తున్నారు. అయితే ఈ ఆయిల్ ప్యాకెట్లపై ఎంఆర్పి రూ.150 నుంచి రూ.175 వరకు ఉంటుంది. అందువల్ల తాము ఎంఆర్పి కంటే ఎక్కువ విక్రయించడం లేదని చెప్పి వ్యాపారులు తప్పించుకుంటున్నారని అధికారులు చెబుతున్నారు. ఒకేసారి రెండేళ్లకు సరిపడా ముందస్తు ఎంఆర్పిని ముద్రించడం ఉత్పత్తి దారులకు పరిపాటిగా మారింది.

పచ్చిశనగ పప్పు రెండు నెలల క్రితం వరకు కిలో రూ.75 వరకు ఉండగా ప్రస్తుతం రూ.95కి పెరిగాయి. దీంతో శనగపిండి, పుట్నాల పప్పుల ధర కూడా పెరిగింది. మినప గుళ్లధర కిలోరూ.120కి తగ్గినా ఇప్పటికి దుకాణాల్లో రూ.140 వరకు విక్రయిస్తున్నారు. ప్యాకింగ్ సరుకు కిలో రూ.200 వరకు అమ్ముతున్నారు. వేరుశనగ గుళ్ల రూ.140 నుంచి రూ.160 వరకు పలుకుతున్నాయి. మరోవైపు బియ్యం ధరలు 25 కిలోల బస్తా కర్నూలు సోనా రకం రూ.1600 నుంచి రూ.1800 వరకు విక్రయిస్తున్నారు. బియ్యం ధరలు ప్రతి మూడునెలలకు కిలోకి రూ.5 వరకు పెరుగుతున్నాయి. విడిగా మార్కెట్‌లో బియ్యం ధర కిలో రూ.60కి తగ్గడం లేదు. బియ్యంలో స్టీమ్ రకాల మాత్రం 25 కిలోల బస్తా రూ.1500కు విక్రయిస్తున్నారు. ఈ బియ్యం హోటళ్లలో ఎక్కువగా వినియోగిస్తున్నారు. గత ఆరు నెలల కాలంలో బియ్యం ధర కిలోకి రూ.15 నుంచి రూ.20 వరకు పెరిగింది. పాతబియ్యంకు, కొత్త బియ్యం ధరల వ్యత్యాసం ఎక్కువగా ఉంటోంది. పాత బియ్యం అంటే 2023 జనవరిలో వచ్చిన ధాన్యంకు సంబంధించిన బియ్యం ధరలు బాగా ఎక్కువగా ఉన్నాయి. వీటి ధర కిలో రూ.70 నుంచి రూ.80 వరకు విక్రయిస్తున్నారు. ఇతర నిత్యావసర వస్తువుల ధరలన్నీ గత నాలుగు నెలల కాలంలో కిలోకి రూ.5 నుంచి రూ.10 వరకు పెరుగుదల కొనసాగుతోంది. దీంతో ప్రజలకు ఆర్థిక అవస్థలు తప్పడం లేదు.

కార్మికోద్యమ నిర్మాణంలో చంద్రపాల్ కీలక పాత్ర

సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్. నరసింగరావు

టి.చంద్రపాల్ దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా)

విశాల కార్మికోద్యమ నిర్మాణంలో చంద్రపాల్ కీలక పాత్ర వహించారని సిఐటి యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్. నరసింగరావు అన్నారు. ఎల్ఐసిలో వివిధ హెూదాలలో విధులు నిర్వహించి పదవి విరమణ పొందిన టి.చంద్రపాల్ ఉద్యోగ విరమణ అభినందన సభ ఆదివారం స్థానిక ప్రైవేట్ పంక్షన్ హాలులో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిహెచ్. నరసింగరావు మాట్లాడుతూ ఎల్ఐసిలో 29 సంవత్సరాలు ఉద్యోగ భాద్యతలు నిర్వహించి, ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ జాయింట్ సెక్రటరీగా ఉద్యోగుల పోరాటా లకు నాయకత్వం వహించిన టి. చంద్రపాల్ విశాల కార్మికొద్యమ నిర్మాణం లో కీలక పాత్ర పోషించారన్నారు. ఎంఎల్‌సి కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ శాసనమండలి ఎన్నికలలో ప్రోగ్రస్సీవ్ డెమోక్రటిక్ ఫ్రంట్ ఆభర్థుల గెలుపుకు చంద్రపాల్ విశేష కషి చేశారని కొనియాడారన్నారు. సిపిఎం రాష్ట్ర నాయకులు వై.వేంకటేశ్వరావు మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ ఉద్యమం లో చంద్రపాల్ పోరాట కషి కి అభినందనియమన్నారు. ఎల్ఐ సి సీనియర్ డివిజనల్ మేనేజర్ జి. సుధాకర్ బాబు మాట్లాడుతూ మూడు దశాబ్దాలుగా ఎల్ఐసికి సేవలు అందించిన చంద్ర పాల్ వారి శేష జీవితాన్ని ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు. ఎల్ఐసి యూనియన్ సౌత్ సెంట్రల్ జోనల్ ఫెడరేషన్ నాయకులు జి. తిరుపతయ్య మాట్లా డుతూ యూనియన్ పిలుపుల అమలులో యూనియన్‌ను నిర్మాణాత్మకంగా బలోపేతం చేయడంలో చంద్రపాల్ చేసిన కషి మరువలేనిది అని కొనియాడారు. ఐసిఇయు డివిజన్ ప్రధాన కార్యదర్శి జి. కిషోర్ కుమార్ అధ్యక్షత వహించిన ఈ పదవి విరమణ అభినందన సభ లో జి.సుధాకర బాబు, బి హెచ్ వి ఎల్ రాధాకృష్ణమూర్తి, ఎస్ రఘు, కె. ఉదయలక్ష్మి, హెచ్ విఠల్ కుమార్, మాదల వెంకటేశ్వర రావు, కె. బుల్లయ్య, ఎస్ దిలీప్, ఆర్ వి. రమేష్ కుమార్, యుటిఎఫ్ నాయకులు జె లెనిన్ బాబు,ఉమా మహేశ్వరరావు, టెలీకామ్,అంగన్వాడీ, పోస్టల్, బ్యాంకు, ఏజెంట్స్ యూనియన్ నాయకులు పాల్గొని చంద్రపాల్ సేవలను కొనియాడారు.

రాష్ట్రంలో కార్ స్పోర్ట్స్ ఏర్పాటుకు కృషి

● ఇండియన్ కార్ స్పోర్ట్స్ ప్రెసిడెంట్ అరిందం గోష్

మాట్లాడుతున్న గోష్

ప్రజాశక్తి-గన్నవరం

ఆంధ్రాలో కార్ స్పోర్ట్స్ ను గవర్నమెంట్ ఏర్పాటు చేసేదిశగా చర్యలు తీసుకుం టామని ఇండియన్ కార్ స్పోర్ట్స్ ప్రెసిడెంట్ అరిందం గోష్ తెలిపారు. ఆదివారం కలకత్తా నుండి గన్నవరం విమానాశ్రయం కు చేరుకున్న ఇండియన్ కార్ స్పోర్ట్స్ ప్రెసిడెంట్ అరిందం గోష్‌కు ఆంధ్ర మోటర్ స్పోర్ట్స్ అసోసియేషన్ ప్రజెంటీనర్ మెర్ల వంశీ, టీమ్ సభ్యులు స్వాగతం పలికారు. అనంతరం మెర్ల వంశీ నివాసంలో మీడియాతో అరిందాం గోష్ మాట్లాడుతూ ఇంటర్నేషనల్ కార్ స్పోర్ట్స్ హిమాలయన్ విన్నర్ ను, అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ చేతుల మీదుగా నేషనల్ అవార్డు తీసుకున్నట్లు తెలిపారు. సుమారు 50 సంవత్సరాలుగా కార్ రేసింగ్ లో ప్రావీణ్యతతో పాటు ఎన్నో నేషనల్ అవార్డు పొందినట్లు చెప్పారు. ఆంధ్రప్రదేశ్లో కార్ స్పోర్ట్స్ ను ఏర్పాటు చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నామనీ, అమరావతికి సమీపంలో రేసింగ్ గ్రౌండ్ లను ఏర్పాటు చేసే సదుద్దేశంతో ఆంధ్రప్రదేశ్ రావడం జరిగిందన్నారు. ఇండియాలో, ఆంధ్రప్రదేశ్లో ముఖ్యంగా కార్ రేసింగ్ స్పోర్ట్స్ గురించి చాలామందికి అవగాహన లేదన్నారు. దానిపై అవగాహన కల్పించేందుకు కషి చేస్తున్నట్లు చెప్పారు. త్వరలో ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు నాయుడు తో కలిసి ఆంధ్రప్రదేశ్లో కార్ స్పోర్ట్స్ అకాడమీ ఏర్పాటుకు స్థలం మరియు నిధులు గురించి చర్చిస్తామన్నారు. తాను అడిగితే ఎన్నో కార్పొరేట్ సంస్థలు నిధులు స్పాన్సర్ చేయడానికి సిద్ధంగా ఉన్నాయన్నారు. ఆంధ్రప్రదేశ్లో అన్ని గేమ్స్ తో పాటు కార్ స్పోర్ట్స్ కూడా విదేశాలతో పోటీపడి నేషనల్ గేమ్స్ లో పోటీ పడేవిధంగా ఆంధ్ర నుండి యువతను తయారు చేస్తామన్నారు. అనంతరం అజ్జంపూడి గ్రామంలో మానసిక వికలాంగుల కేంద్రాన్ని గోష్ పరిశీలించారు. అల్లాపురం గ్రామంలో ఆలయ నిర్మాణానికి వంశీ 50 వేల విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో మెర్ల వంశీ, కంభంపాటి శశి, విజయ్ కుమార్, బాబీ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పల్లె పండుగ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి : రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మౌలిక సదుపాయాలను కల్పించేందుకు ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు పల్లె పండగ వారోత్సవాలను నిర్వహించనున్నారు. జిల్లాలో 166 గ్రామాల్లో రూ.34 కోట్లతో పలు అభివృద్ధి పనులకు శ్రీకారంచుట్టనున్నారు. తారురోడ్లు, సిమెంట్ రోడ్లు, డ్రైన్లు, కాల్వలు, మరుగుదొడ్లు, అంగన్ వాడీ కేంద్రాలకు ప్రహరీల నిర్మాణం, వ్యవసాయ కుంటలు, పశువుల శాలలు, ఇంకుడు గుంతల నిర్మాణం వంటి అనేక అభివద్ధి పనులను చేపట్టనున్నారు.గ్రామీణ స్థాయిలో వ్యవసాయ, నీటి, రవాణా వ్యవస్థలను మరింత బలోపేతం చేయడం జరుగుతుందని చెబుతున్నారు. ఇందులో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచడం ద్వారా గ్రామాల్లో ఆర్థిక పురోగతి మెరుగుపడుతుందని అధికారులు తెలిపారు. జాతీయ ఉపాధి హామీ పథకం నిధులతో ఈపనులు చేపడతామని తెలిపారు.

అంత్యక్రియలు నిర్వహించిన కూతురు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి : కుమారులు లేకపోవడంతో తండ్రి మృతదేహానికి కుమార్తె అంత్యక్రియలు నిర్వహించిన ఘటన గుంటూరు మండలం గోరంట్లలో జరిగింది. గోరంట్లకు చెందిన విద్యుత్ శాఖ ఎడిఈ మేరావత్ బాబ్జిజీనెల 11న అనారోగ్యంతో మృతి చెందారు. ఆయనకు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. సంప్రదాయం ప్రకారం కుమారులు లేక ఇంటిపేరున ఉన్న వారు అంత్యక్రియలు నిర్వహించాలి. అయితే ఇతరులపై ఆధారపడకుండా బాబ్జి పెద్ద కూతురు జాహ్నవి కన్నీటితోనే తండ్రి చితికి ఆదివారం నిప్పంటించింది. కుటుంబ పెద్దలు, బంధువులు ఆమె నిర్ణయాన్ని స్వాగతించారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రజాశక్తి - విజయవాడ :పున్నమి ఘాట్ బబ్బూరి గ్రౌండ్స్‌లో నారీశక్తి విజయోత్సవం రెండో రోజు నిర్వహించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజలను ఎంతోగానో ఆకట్టుకున్నాయి. నారీశక్తి విజయోత్సవ ప్రాంగణం శనివారం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. మహిళా శక్తి ధ్వనించేలా ప్రాంగణమంతా సందడి నెలకొంది. కళాకారులు ప్రదర్శించిన వివిధ కళా రూపాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజలను అబ్బుర పరచాయి. గిరిజన వేషధారణతో డప్పులతో ప్రదర్శించిన కొమ్ము నృత్యం ఆకర్షించింది. కొండల్లో, కోనల్లో జీవించే గిరిజనులు చేసే నృత్యాలను కళాకారులు కళ్లకు కట్టినట్లు ప్రదర్శించటం ప్రజలను ఆకట్టుకుంది. వివిధ పండుగల్లో పోతురాజ వేషధారణతో ప్రదర్శించే పోతురాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. 15 మంది బృందం విన్యాసాలు ప్రదర్శించారు. 15 మంది జానపద డప్పు నృత్యాన్ని ప్రదర్శించారు.. వివిధ భంగిమల్లో నృత్యం చేస్తూ, పిరమిడ్ ఆకారంలో జానపద పాటలు, భక్తి పాటలు పాడుతూ ప్రజలను రంజింప చేశారు. జానపద డప్పు వాయిద్యం వాయిస్తూ ప్రజలను ఆహ్లాదపరచారు. మహిళలు ప్రదర్శించిన బోనాలు ఎంతోమందిని ఆకట్టుకున్నాయి.

మద్యం దుకాణాలకు నేడు లాటరీ

(మొదటి పేజీ తరువాయి)

127 షాపులకు 4448 దరఖాస్తులు, పల్నాడు జిల్లాలో 127 షాపులకు 2638 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. మంగళగిరి పరిధిలో అత్యధికంగా, మాచర్ల పరిధిలో అతి తక్కువ దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. దరఖాస్తుల ద్వారా గుంటూరు, పల్నాడు జిల్లాల్లో ప్రభుత్వానికి రూ.141 కోట్లు ఆదాయం వచ్చింన్నారు. మద్యం షాపులకు దరఖాస్తు చేసుకున్న వారు ఉదయం 7 గంటలకే లాటరీ జరిగే ప్రదేశానికి రావాలని కోరారు. లాటరీలో మద్యం షాపు దక్కించుకున్న వారు మొత్తం రుసుంలో ఆరోవంతును చెల్లించాల్సి ఉంటుందని, లైసెన్సను అక్కడే చేస్తామని వివరించారు.

కొలుపుల వద్ద ఘర్షణ 11మందికి గాయాలు

ప్రజాశక్తి- మాచర్ల రూరల్

మాచర్ల మండలం కంభంపాడు గ్రామంలో దసరా పండుగ సందర్భంగా కొలుపుల దగ్గర తలెత్తిన ఘర్షణలో చిలికి చిలికి పెద్దదై ఇరు వర్గాలు ఒకరి పై మరొకరులు దాడులు చేసుకునే వరకు వచ్చింది. కత్తులు, కర్రలతో ఇరు వర్గాలు దాడులు చేసుకోవటంతో 11 మందికి గాయాలు అయ్యాయి. ముదిరాజు సామాజిక వర్గానికి చెందిన బంధువుల మధ్య దసరా పండుగ రోజు కొలుపుల సందర్భంగా డిజె ఊరేగింపు దగ్గర ఘర్షణ తలెత్తింది. విషయం తెలుసుకున్న రూరల్ ఎస్ఐ నారాయణ గ్రామానికి వెళ్ళి ఇరు వర్గాలను హెచ్చరించి వచ్చారు. అప్పటికి సద్దుమణిగినా ఆదివారం ఉదయం ఒకరికొకరు ఎదురు పడటంతో ఘర్షన మొదలై కత్తులు, కర్రలతో దాడులు చేసుకున్నారు. ఇరు వర్గాలకు చెందిన 11 మందికి గాయాలు అయ్యాయి. మాచర్ల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. చికిత్స పొందుతున్న వారిలో కొరటా వెంకట్రావు, కొరటా చిన వెంకయ్య, మల్లయ్య, రాంమోహన్‌రావు తదితరులు వున్నారు. రూరల్ ఎస్ఐ నారాయణ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ - బంగారం, నగదు అపహరణ

ప్రజాశక్తి తెనాలి

ఇంటికి తాళం వేసి తీర్థయాత్రలకు వెళ్లి తిరిగి వచ్చేలోగా దొంగలు తాళం పగలగొట్టి బంగారం నగదు అపహరించారు. పట్టణ త్రి టౌన్ పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం పోలీస్ శాఖలో నాలుగవ తరగతి ఉద్యోగిగా పనిచేసి పదవీ విరమణ అనంతరం బాలాజీరావుపేట మసీదు రోడ్డులో నివాసం ఉంటున్న ఈలప్రోలు శివన్నారాయణ తన భార్య వెంకాయమ్మతో కలిసి పై అంతస్తులో ఉంటుండగా, అతని కుమారుడు కింద పోర్షన్‌లో ఉంటున్నారు. కుటుంబ సభ్యులంతా కలిసి ఈ నెల 8వ తేదీన తీర్థయాత్రలకని రామేశ్వరం వెళ్లారు. తిరిగి ఆదివారం తెల్లవారు జామున మూడు గంటల సమయంలో ఇంటికి వచ్చారు. శివన్నారాయణ నివాసం ఉంటున్న పై అంతస్తు ఇంటి తలుపులు పగుల కొట్టి ఉండటంతో పాటు బీరువాలోని వస్తువులన్నీ చెలా చెదురుగా పడి ఉండటాన్ని గమనించి చోరి జరిగినట్లం గుర్తించి త్రీ టౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే స్పందించిన పోలీసులు ఆదివారం ఉదయం క్లూస్ టీమ్ పిలిపించి ఆధారాలు సేకరించారు. బెడ్‌రూమ్‌లో ఉన్న బీరువా పగులకొట్టి అందులో ఉన్న సుమారు 12 సవర్ల బంగారు ఆభరణాలు, రూ.5 వేల నగదును దుండ గులు అపహరించుకు వెళ్లినట్లు శివన్నారాయణ తెలిపారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కాల్వలో పడిన జెసిబి డ్రైవర్ మృతి

ప్రజాశక్తి- మాచర్ల

ప్రమాదవశాత్తు నాగార్జునసాగర్ కుడికాలువలో పడి ఒక వ్యక్తి మృతిచెందిన సంఘటన శనివారం జరిగింది. పట్టణంలోని నెహ్రూనగర్‌కు చెందిన ఓబుల శంకర్ (26) మండలం లోని తాళ్ళపల్లి బ్రిడ్జి వద్ద నాగార్జునసాగర్ కుడి శంకర్ ప్రమాదవశాత్తు జారి పడి మృతిదెందాడు. దసరా పండుగ సందర్భంగా స్నేహితుడుగో కలసి బైక్‌పై నాగార్జన సాగర్ వెళ్ళివస్తూ మార్గ మధ్యలో తాళ్ళపల్లి బ్రిడ్జి వద్ద ముఖం కడుక్కునేందుకు కుడి కాలువలోకి దిగి ప్రమాద వశాత్తు జారి పడి ప్రవాహ వేగానికి కొట్టుకు పోయాడు. శంకర్ మృతదేహం ఆదివారం బుగ్గవాగు రిజర్వాయర్ వద్ద లభించింది. శంకర్‌కు భార్య ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. విజయపురిసౌత్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మాచర్ల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

పోక్సో కేసు నమోదు - యువకుడు ఆత్మహత్య?

ప్రజాశక్తి- మాచర్ల

మైనర్ బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించాడని ఒక వ్యక్తి పై ఫోక్సో కేసు నమోదు కావటంతో శనివారం ఆ వ్యక్తి కాలువలో దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లుగా అనుమానిస్తున్నారు. మాచర్ల మండలంలోని రాయవరం గ్రామానికి చెందిన ఉప్పుతోళ్ళ శ్రీనివాసరావు(23) ఆదే గ్రామానికి చెందిన మైనర్ బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించటంతో బాలిక తల్లిదండ్రులు మాచర్ల రూరల్ పోలీస్ స్టేషన్ శ్రీనివాసరావుపై ఫిర్యాదు చేశారు. పోలీసులు శ్రీనివాసరావుపై ఫోక్సో కేసు నమోదు చేశారు. కేసు నమోదు కావటంతో శ్రీనివాసరావు కంభంపాడు బ్రిడ్జి వద్ద నాగార్జునసాగర్ కుడికాలువలో దూకినట్లు తెలుస్తుంది. శ్రీనివాసరావు బైక్ కుడి కాలువ వద్ద వుండటంతో కాలువలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు అనుమానం వ్యక్తం అవుతుంది. మిస్సింగ్ కేసు నమోదు చేసిన మాచర్ల రూరల్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టీసీ బస్సు ఢీ కొని ఒకరు మృతి

ప్రజాశక్తి - తుళ్లూరు

ఆర్టీసీ బస్సు ఢీ కొట్టడంతో వ్యక్తి మృతి చెందాడు. రాజధాని అమరావతి పరిధిలోని తుళ్లూరు మండలం రాయపూడి వద్ద ఆదివారం రాత్రి జరిగిన ప్రమాదంలో లింగాయ పాలెం దళితవాడకు చెందిన నూతక్కి రామారావు (52) అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రామారావు దొండపాడు లోని టిడ్కో గృహంలో జీవనం సాగుస్తున్నాడు. రోజువారీ పనుల నిమిత్తం సొంత గ్రామమైన లింగాయ పాలెంకు వచ్చి వెళుతుంటాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి 6.30 గంటల సమయ ంలో లింగాయపాలెం నుంచి బైక్ పై దొండపాడు వెళుతుండగా అమరావతి నుంచి విజయవాడ వెళుతున్న ఆర్టీసీ బస్సు ఎదురుగా వస్తున్న బైక్ ను ఢీ కొట్టింది. దీంతో రామా రావుకు తీవ్ర గాయలై మృతిచెందాడు. రామారావుకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

మృతుని బంధువుల ఆందోళన

రామారావు కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ అతని కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు ఆందోళనకు దిగారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ భవన సముదాయాల వద్ద నాలుగు రోడ్ల కూడలిలో రోడ్డుపై కొద్దిసేపు బైఠాయించారు.

వలస కార్మికుడు మృతి

ప్రజాశక్తి - తుళ్లూరు : మద్యం మత్తులో చెరువులో పడి వలస కార్మికుడు మృతి చెందిన సంఘటన కేసును పోలీసులు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం శ్రీకాకుళం నుంచి భవన నిర్మాణ పనుల నిమిత్తం వచ్చిన ఎస్ రామకృష్ణ అనే కార్మికుడు శనివారం దసరా పండుగ రోజు మద్యం అధికంగా తాగి రాజధాని అమరావతి పరిధిలోని తుళ్లూరు గ్రామంలో ఉన్న అయ్యన్న చెరువు కాలనీలోని చెరువులో పడి చనిపోయాడు. విఆర్వో ఎం కోటేశ్వరరావు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. మేస్త్రి రాంబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని అమరావతి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో బాలిక మృతి

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

ద్విచక్ర వాహనాన్ని ట్రాక్టర్ ఢీకొన్న సంఘటనలో బాలిక అక్కడిక్కడే మృతిచెందగా బాలిక సోదరుడు తీవ్రంగా గాయపడ్డాడు. సత్తెనపల్లి మండలం లక్కరాజు గార్లపాడు సమీపంలో ఆదివారం జరిగిన ఈ ప్రమాదంలో లక్కరాజు గార్లపాడు గ్రామానికి చెందిన జొన్నలగడ్డ కావ్య (13) మృతి చెందింది. మృతురాలు కావ్య పెద్దమ్మ కొడుకు అయిన మీసాల వంశితో కలిసి ఫిరంగిపురం మండలం 113 తాళ్లూరులో ఉంటున్న పెద్దమ్మ ఇంటికి ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. మార్గమధ్యలో వ్యవసాయ కూలీలతో వెళుతున్న ట్రాక్టర్ వెనుక నుంచి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో బైక్ మీద ప్రయాణిస్తున్న కావ్య అక్కడికక్కడే మృతిచెందగా వంశీ తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన వంశీని 108 వాహనం ద్వారా సత్తెనపల్లి ఏరియా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం గుంటూరు తరలించారు. మృతి చెందిన బాలిక లక్కరాజు గార్లపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతుంది. బాలిక మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. మృతురాలు తండ్రి కోటేశ్వరావు ఫిర్యాదు మేరకు సత్తెనపల్లి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహారాజశ్రీ అడిషనల్ సివిల్ జడ్జ్, సీనియర్ డివిజన్, నర్సరావుపేట
IA 590 of 2023 in OS 48 of 2023
Between:
ముద్ద రమేష్ .... వాది
V/S
సోము గురవయ్య .. ..ప్రతివాది
To,
సోము గురవయ్య S/o రాధాకృష్ణ మూర్తి, హిందు, వయస్సు 56 సం. R/o D.NO.11- 9-7/2, రామిరెడ్డిపేట, నరసరావుపేట, పల్నాడు జిల్లా.
ఇందలి దావాలో ప్రతివాది అయిన మీరు, వాది వద్ద 25 లక్షల రూపాయలు అప్పుగా తీసుకొని తిరిగి ఇవ్వనందున ఇందలి వాది మీపై పై కోర్ట్ నందు దావా దాఖలు చేసి ఉన్నారు. సదరు దావాలో షెడ్యూల్ ఆస్తి జప్తు నిమిత్తము పై 590/2023 నందు మీకు నోటీసు నిమిత్తమై ఎన్ని పర్యాయములు శ్రీ కోర్ట్ వారు మీకు నోటీసులు పంపినను మీరు సదరు నోటీసులు తీసుకొనకమీరు మీచిరునామాలు మారుస్తూ ఉన్నందున శ్రీ కోర్టు వారు మీకు నోటీసు నిమిత్తం ఈ పేపరు ప్రకటన ద్వారా ది. 29-10-2024 కు నోటీసు ఆర్డరు వేసి ఉన్నారు. కావున ఇందుమూలము గా తెలియజేయునది ఏమనగా మీరు ది.29-10-2024 న శ్రీ కోర్టు వారి ఎదుట ఉదయం 10.30 కు హాజరై మీకు గల ఆక్షేపణలను తెలుపుకొన వలెను. అట్లు హాజరు కాని యెడల మీ పరోక్ష మందు పై IA 590/2023 తీర్మానం చేయుదురని ఇందుమూలముగా తెలియజేయటమైనది.
ఇట్లు
పి.రాజశేఖర్, న్యాయవాది,
నరసరావుపేట, పల్నాడు జిల్లా.

మహారాజశ్రీ అడిషనల్ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) నరసరావుపేట.
O.S 48/2023
బిట్వీన్:
ముద్ద రమేష్ ....పిటిషనర్/వాది
V/S
సోముగురవయ్య ....ప్రతివాది
To,
సోము గురవయ్య, S/o రాధాకృష్ణ మూర్తి, హిందు, వయస్సు 56 సం., R/D No:11-9-7/2 రామిరెడ్డిపేట, నరసరావుపేట, పల్నాడు జిల్లా.
ఇందలి దావాలో ప్రతివాది అయిన మీరు వాది వద్ద 25 లక్షల డబ్బులు అప్పుగా తీసుకుని తిరిగి ఇవ్వనందున ఇందలి వాది మీపై పై కోర్టు నందు దావా దాఖలు చేసి ఉన్నారు. సదరు దావాలో నోటీసు నిమిత్తము ఎన్ని పర్యాయములు మీకు కోర్టు వారి ద్వారా నోటీసులు పంపినను మీరు నోటీసులు తీసుకొనక మీరు మీ చిరునామాలు మారుస్తూ ఉన్నందున శ్రీ కోర్టు వారు మీకు నోటీసు నిమిత్తం ఈ పేపర్ ప్రకటన ద్వారా ది.29-10-2024 కు నోటీసు ఆర్డరు వేసి ఉన్నారు.కావున ఇందుమూలంగా తెలియజేయడమైనది ఏమనగా మీరు ది.29-10-2024న శ్రీ కోర్టు వారి ఎదుట ఉదయం 10:30 లకు హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనవలెను. అట్లు హాజరు కాని యెడల మీ పరోక్షమందు పై దావా తీర్మానం చేయుదురని తెలియజేయడమైనది.
ఇట్లు.
పి.రాజశేఖర్, న్యాయవాది,
నరసరావుపేట, పల్నాడు జిల్లా.

అవగాహన ఆధ్వర్యంలో దసరా వేడుకలు

ప్రజాశక్తి - గుంటూరు

పండుగ పర మార్థం పది మంది కలిసి ఆడటం, పాడటం, చెడును నిరసించి మంచికి జేజేలు పలకట మని, చెడు మీద మంచి గెలిచిన ప్రతిసారి మనుష్య లంతా గెలిచినట్లేనని, అదే నిజమైన పండుగని, దసరా అలాంటి పండుగేనని సినీ రంగ విశ్లేషకులు, సినీ దర్శకులు కె. జయ కుమార్ అన్నారు. శనివారం దసరా సంగదర్భంగా అవగాహన సంస్థ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. మంచి సాధించిన విజయానికి ప్రతీక, మన అమ్మల వీరత్వానికి ఒక మచ్చు తునక దసర అన్నారు. రచయిత్రి పింగళి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ఇది చెడు మీద కత్తి తిప్పిన దుర్గమ్మను తలుచుకోవాల్సిన సమయమని, పురుషాధిక్యపు చెట్టు మీద ఎక్కు పెట్టటానికి సమానత్వపు గొడ్డలిని సిద్ధం చేసుకోవాల్సిన సందర్భం అని అన్నారు. మన అమ్మల, అమ్మమ్మల వీర గాథలను నరనరాన ఇంకించుకోవాల్సిన సమయం ఇదేనన్నారు. అవగాహన సంస్థ ఆధ్వర్యంలో జరిగిన దసరా వేడుకలలో పాల్గొన్న కళాకారులు, గాయకులు, సాహితీవేత్తలు ఉత్సాహంగా.. ఉల్లాసంగా దసరా వేడుకలో పాల్గొన్నారని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి తెలిపారు.

మానసిక సమస్యలను నిర్లక్ష్యం చేయొద్దు

డాక్టర్ కె. సురేష్ కుమార్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

మానసిక సమస్యలు ఏ వయస్సు వారికైనా రావచ్చనని , తొలి దశలోనే గుర్తించి వైద్యుని సంప్రదించడం ద్వారా మందులు లేకుండానే అనేక సమస్యల్ని కౌన్సిలింగ్ ద్వారా పరిష్కరించు కోవచ్చునని ప్రముఖ మానసిక వైద్య నిపుణులు డాక్టర్ కె.సురేష్ కుమార్ అన్నారు. ఆదివారం స్థానిక బ్రాడీపేట లోని సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ కార్యాలయంలో ఎస్ హెచ్ ఓ హైపర్ టెన్షన్ అండ్ డయాబెటిక్ క్లబ్, మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్తంగా నిర్వహించిన మానసిక సమస్యల ఉచిత వైద్య సలహా శిబిరం, శాస్త్రీయ అవగాహన సభలో ఆయన ప్రసంగించారు. సభకు మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ మెడికల్ క్యాంప్స్ చైర్మన్ టి ధనుంజయ రెడ్డి అధ్యక్షత వహించారు. సురేష్ కుమార్ ప్రసంగాన్ని కొనసాగిస్తూ నేటి సమాజ పరిస్థితులు,జీవన విధానం, ఆహారంలో మార్పులు, వృత్తిపరమైన మానసిక ఒత్తిడితో ఆందోళనలు పెరుగుతున్నా యన్నారు. ఈ సమస్యలు చాలా చిన్నవేనని కానీ ప్రాథమిక దశలోనే నిరోధించుకోవాలన్నారు. మానసిక వ్యాధులతో పాటు బిపి, షుగర్లకు కారణమవుతున్నాయన్నారు. ఆహారపు అల వాట్లను మార్చుకోవాలన్నారు. డాక్టర్ సేవకుమార్ మాట్లా డుతూ ప్రతినెల రెండవ ఆదివారం ఒక వైద్య నిపుణులతో వైద్య శిబిరం నిర్వహించడం జరుగుతుందన్నారు. వచ్చేనెల నవంబర్ 'ప్రపంచ మధుమేహం నిరోధక మాసం' సందర్భంగా ప్రతి ఆదివారం ఒక స్పెషలిస్ట్‌తో ఉచిత వైద్య శిబిరం -శాస్త్రీయ అవగాహన సభ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో నిర్మలరాణి, కె ఆనందరావు, ఎస్ సాంబశివరావు, ఎం రామారావు, టీ.వీ . సాయిరాం ఎస్ శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

పంపిణీలో కౌన్సిలర్లు కోటేశ్వరరావు, సంజీవరెడ్డి

మున్సిపల్ వర్కర్స్‌కు దుస్తుల పంపిణీ

ప్రజాశక్తి తెనాలి : దసరా పండుగను పురస్కరించుకొని పట్టణంలోని 15వ వార్డ్ కౌన్సిలర్ గుంటూరు కోటేశ్వరరావు ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులకు నూతన వస్త్రాలను బహూకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాలుగా పండుగ సందర్భంలో కార్మికులకు వస్త్రాలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పేరం సంజీవరెడ్డి, జిడుగు తులసిరాం, కె వాసు, ఎస్ వెంకట రావు, ఎస్ కొండలరావు, ఎం ప్రభాకర్, డి మల్లికార్జునరావు, శివారెడ్డి, రాజా, మనోజ్, బాబి, ఫణి పాల్గొన్నారు

20న 'భారత్ ప్రగతిలో టాటాల పాత్ర' చర్చా గోష్టి

ప్రజాశక్తి -గుంటూరు

జన చైతన్య వేదిక ఆంధ్రప్రదేశ్ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 20న ఆదివారం ఉదయం 10 గంటలకు గుంటూరు లోని రామన్నపేట 1వ లైన్‌లోని జన చైతన్య వేదిక హాలులో భారత్ ప్రగతిలో టాటాల పాత్ర అనే అంశంపై చర్చా గోష్టి నిర్వహి స్తున్నట్లు జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ లోక్ సభ ఫ్లోర్ లీడర్, నరసరావుపేట లోక్ సభ సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు, ప్రముఖ ఆర్థిక నిపుణులు, గ్లోబల్ ఫోరం ఫర్ సస్టైనబుల్ ట్రాన్స్ఫర్మేషన్ వ్యవస్థాపక డైరెక్టర్ చెరుకూరి కుటుంబరావు, మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్, శాసనమండలి సభ్యులు కె.ఎస్. లక్ష్మణరావు తోపాటు వివిధ వ్యాపార, వాణిజ్య రంగాల ప్రముఖులు, స్వచ్ఛంద సంస్థల ప్రజా సంఘాల నేతలు ప్రసంగిస్తారని తెలిపారు. రతన్ టాటాకు నివాళులర్పించి, కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

భూమి పోయి.. వలసపోతూ..

- దుర్భరంగా యడవల్లి ఎస్సీ రైతుల దుస్థితి
- మైనింగ్ పేరుతో భూములను లాక్కున్న గత ప్రభుత్వం
- ఉపాధి కరువై పస్తులుంటున్న కుటుంబాలు
- పొట్టకూటి కోసం మైసూరుకు వలసలు

ఒకప్పుడు మాగాణి పంటలు పండగా నేడు బీడుగా దర్శనమిస్తున్న దళితుల భూములు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

ఒకప్పుడు పంటలు పండించి కుటుంబాలను పోషించుకున్న తాము ఇప్పుడు ఆ భూములను పోగొట్టుకుని పస్తులుంటున్నామని మండలంలోని యడవల్లికి చెందిన ఎస్సీ రైతులు వాపోతున్నారు. వారి పొలాలను మైనింగ్ పేరుతో లాకున్నారు. గ్రామంలో మిగతా వారికి పొలాలున్నా ఎస్సీ కాలనీ వారిని పనులకు సరిగా పిలవడం లేదు. ఉపాధి హామీ పనులనూ చేయించడం లేదు. ఈ నేపథ్యంలో పొట్టకూటికి వలసలే గతయ్యాయి.

యడవల్లిలోని ఎస్సీ కాలనీకి చెందిన 120 కుటుంబాలకు గతంలో 416.15 ఎకరాలను ఏక పట్టాగా ప్రభుత్వం మంజూరు చేసింది. దీన్ని వైపిసి ప్రభుత్వం మైనింగ్ పేరుతో తీసుకుంది. పరిహారం మంజూరులోనూ అన్నీ అవకతవకలే. దీనిపై అప్పట్లోనే ఉద్యమించగా తీవ్ర నిర్బంధాన్ని అప్పటి ప్రభుత్వం విధించింది. కనీసం మిగులు భూములు సాగుకూ అవకాశం ఇవ్వాలనే స్థానికుల విన్నపాన్ని ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ఎస్సీ కాలనీలో 150 వరకూ ఎస్సీ కుటుంబాలు ఉండగా ఆరేడు వందల మంది జనాభా ఉంటారు. వీరిలో ఎక్కువ మంది వ్యవసాయం మీద ఆధారపడగా కొద్దిమంది మాత్రం పశుపోషణతో ఉపాధి పొందేవారు. పరిమిత సంఖ్యలో కుటుంబాలు మైసూర్, ఇతర ప్రాంతాలకు వలసెళ్లేవారు. ఇప్పుడు భూములు కోల్పోయి, ఐదారు నెలలుగా ఉపాధి హామీ పనులూ చేయించకపోవడంతో ఎక్కువ మంది వలసెళ్లక తప్పడం లేదు. అయితే అక్కడా పనులు ఎక్కువగా ఉండడం లేదని, వారం పదిరోజులకే తిరిగి రావాల్సి వస్తోందని, ప్రయాణ ఖర్చులకే ఎక్కువ కూలి డబ్బులు ఖర్చవుతున్నాయని వాపోతున్నారు. మరోవైపు పశువులకు మేత, దాణ సరిగా సమకూర్చలేక పశుపోషణా కష్టమైంది.

భూములు కోల్పోయిన దగ్గర్నుండి వారి జీవనం అస్తుబిస్తుగా మారింది. కనీసం నష్ట పరిహారంలోనూ వారికి న్యాయం దక్కలేదు భూ సేకరణ చట్టం-2013 ప్రకారం పరిహారం కోసం డిమాండ్ చేస్తున్నారు. వలసెళ్లే అవసరం లేకుండా స్థానికంగానే ఖాళీగా ఉన్న భూములనైనా సాగు చేసుకునే అవకాశం ఇవ్వాలని, ఉపాధి హామీ పనులు కల్పించాలని కోరుతున్నారు. ప్రభుత్వం మారిన నేపథ్యంలో తాజా ప్రభుత్వమైనా వీరి సమస్యలను ఆలకిస్తుందేమోనని, న్యాయం చేస్తుందేమోనని భావిస్తున్నారు. వీరు లేవనెత్తుతున్న అంశాలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు మరోసారి ఆందోళలకు సిద్ధమవుతున్నారు.

కబడ్డీ విజేతగా దాచేపల్లి ఎంఎల్‌టి జట్టు

ప్రజాశక్తి-దాచేపల్లి

దసరా సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ, డివైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో దాచేపల్లిలో నిర్వహించిన కబడ్డీ పోటీలు శనివారం రాత్రి ముగిశాయి. మూడ్రోజులపాటు హోరాహోరీగా సాగిన పోటీల్లో జిల్లా వ్యాప్తంగా 20 జట్లు పాల్గొనగా దాచేపల్లి ఎంఎల్‌టి జట్టు విజేతగా నిలిచింది. రెండో స్థానాన్ని గామాలపాడు జట్టు, మూడో స్థానాన్ని రెడ్డిగూడెం జట్లు, నాలుగో స్థానాన్ని దాచేపల్లి ఎంఎల్‌టి జూనియర్ జట్లు దక్కించుకున్నాయి. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ముఖ్యఅతిథిగా చికెన్ జానిబాష, పగడాల భాస్కర్, తోట వెంకటేశ్వర్లు, మస్తాన్‌వలి మాష్టారు, జక్కుల వీరస్వామి, దండే వీరయ్య హాజరై బహుమతులు అందించారు. యువతలో ఐక్యత, స్నేహ భావాలను పెంపొందించే ఇలాంటి పోటీలు ప్రతిఏటా నిర్వహించాలని ఆకాంక్షించారు.

నిరసనకు మద్దతు తెలుపుతున్న పిడిఎం, పికెఎం, కెఎన్‌పిఎస్ నాయకులు

అప్పటి వరకూ పోరాడుతూనే ఉంటాం..

నిరసన దీక్ష శిబిరాన్ని కొనసాగించిన తొలగింపునకు గురైన ఉద్యోగులు, కార్మికులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రాజకీయ కారణాలతో తొలగించిన మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగం ఉద్యోగులు, కార్మికులు తమను విధుల్లోకి తీసుకోవాలని చేపట్టిన నిరసన సమ్మె ఆదివారం 12వ రోజుకు చేరుకుంది. విధుల్లోకి తీసుకోవడంతోపాటు పెండింగ్‌లో ఉన్న 2 నెలల వేతనాలు చెల్లించాలని, అప్పటివరకు నిరసన విరమించేది లేదని బాధిత ఉద్యోగులు, కార్మికులు స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వేధింపులు తాళలేక 40 మంది మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగం ఉద్యోగులు, కార్మికులు రాజీనామాలు చేయగా 15 మంది తమ ఉద్యోగం తమకే ఇవ్వాలంటూ ఏపి మున్సిపల్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. యూనియన్ పల్నాడు జిల్లా గౌరవాధ్యక్షులు షేక్ సిలార్ మసూద్ మాట్లాడుతూ పార్టీల మారిన ప్రతిసారి చిరుద్యోగులు, కార్మికులపై రాజకీయ వేధింపులు సాగించే సంస్కృతిని ప్రభుత్వాలు, ప్రజా ప్రతినిధులు విడనాడాలన్నారు. నిరసనకు పిడిఎం రాష్ట్ర నాయకులు వై.వెంకటేశ్వరరావు, జి.రామకృష్ణ, నల్లపాటి రామారావు, ప్రగతిశీల కార్మిక సమాఖ్య నాయకులు కె.ఏడుకొండలు, కుల నిర్మూలన పోరాట సమితి నాయకులు కృష్ణ, ఎంసిపిఐయు జిల్లా కార్యదర్శి మహమ్మద్ బాషా తదితరులు మద్దతు తెలిపి మాట్లాడారు. 12 రోజులుగా పురపాలక సంఘం కార్యాలయం ఎదుట నిరసన చేస్తున్నా అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోపోవడం సరికాదన్నారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు పని చేస్తామని, ఉద్యోగం కావాలంటే ఎమ్మెల్యే సిఫార్సు లెటర్ కావాలని, ఆయన్ను కలవాలని మున్సిపల్ కమిషనర్ చెప్పడం ఏమిటని ప్రశ్నించారు. యూనియన్ ఇంజినీరింగ్ విభాగం పట్టణ అధ్యక్షులు షేక్ చిన్నఅల్లాబక్షు, ఉద్యోగులు బి.నాగమల్లేశ్వరి, ఎస్.రమాదేవి, షేక్ మహబూబ్ సుభాని, మహబూబ్ బాషా, సైదా, పి.రమణ, షైలు, ఎ.పద్మ పాల్గొన్నారు.

15 మద్యం దుకాణాలకు 289 దరఖాస్తులు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 15 మద్యం దుకాణాలకు 289 దరఖాస్తులు వచ్చినట్లు ఎక్సైజ్ సిఐ పి.విజయ్ కుమార్ ఆదివారం తెలిపారు. సత్తెనపల్లి పట్టణంలోని 6 మద్యం షాపులకు 83 దరఖాస్తులు, సత్తెనపల్లి రూరల్ మండలంలోని 5 మద్యం దుకాణాలకు 87 ధరఖాస్తులు, ముప్పాళ్ల మండలంలోని రెండు దుకాణాలకు 50 దరఖాస్తులు, రాజుపాలెం మండలంలోని రెండు దుకాణాలకు 69 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. 289 దరఖాస్తులు ద్వారా రూ.5.78 కోట్ల ఆదాయం వచ్చిందన్నారు. సోమవారం ఉదయం 8 గంటలకు పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణంలోని ప్రకాష్ నగర్ టౌన్‌హాల్‌లో జిల్లా కలెక్టర్ సమక్షంలో లాటరీ ప్రక్రియ ద్వారా దుకాణాలు కేటాయింపు ఉంటుందని చెప్పారు. దరఖాస్తుదారులు ఉదయం 7 గంటల్లోపు టౌన్‌హాలుకు రావాలని, ఎంట్రీపాస్‌తో పాటు గుర్తింపు కార్డును తప్పనిసరిగా తెచుచ్చకోవాలని సూచించారు.

మాచర్ల సర్కిల్ పరిధిలో 10 దుకాణాలకు 118 దరఖాస్తులు

ప్రజాశక్తి- మాచర్ల

మాచర్ల ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో 10 మద్యం దుకాణాల అనుమతి కోసం 118 దరఖాస్తులు వచ్చాయని ఎక్సైజ్ సిఐ ఎన్.వెంకటరమణ తెలిపారు. మాచర్ల సర్కిల్ పరిధిలో మాచర్ల మున్సిపాల్టీ పరిధిలో 3, మాచర్ల రూరల్ పరిధిలో 2, దుర్గి మండలంలో 2, వెల్దుర్తి మండలంలో 3 షాపులకు 118 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. సోమవారం నర్సరావుపేటలో లాటరీ ద్వారా షాపులను కేటాయిస్తామన్నారు.

దీర్ఘాయుష్మాన్ హెల్త్ సర్వీసెస్ ఆధ్వర్యంలో బైక్ అంబులెన్స్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

దీర్ఘాయుష్మాన్ హెల్త్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ వ్యవస్థాపకులు మద్దినేని రవిచంద్ర

ప్రమాదంలో గాయపడిన వారికి ఆ సమయంలో ప్రతి నిమిషం ఎంతో కీలకమని పల్నాడు జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు అన్నారు. దీర్ఘాయుష్మాన్ హెల్త్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో 'దీర్ఘాయుష్మాన్ బైక్ అంబులెన్స్'ను జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ శనివారం ప్రారంభించి మాట్లాడారు. నరసరావుపేట నుండి అందుబాటులో ఉండే బైక్ అంబులెన్స్ సేవలను క్షతగాత్రులు సద్వినియోగం చేసుకోవాలని, ఆపత్కాల సమయంలో 8340000108, 8186000108 నంబర్లకు ఫోన్ చేస్తే ఒక డాక్టర్ ఒక నర్స్ ప్రమాదం జరిగిన స్థలానికి చేరుకుంటారని అన్నారు. అంబులెన్స్ వచ్చేలోపు ప్రథమ చికిత్సకు అవసరమైన అత్యవసర మందులు, ఆక్సిజన్ క్షతగాత్రులకు అందిస్తారని వివరించారు. గుంటూరు, నరసరావుపేటలో ఉండే ఈ సేవలు పూర్తి ఉచితమన్నారు. దీర్ఘాయుష్మాన్ హెల్త్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ వ్యవస్థాపకులు మద్దినేని రవిచంద్ర మాట్లాడుతూ తన తండ్రి ప్రసాదరావు ప్రమాదంలో గాయపడి తీవ్రంగా రక్తం పోవడంతో ఆస్పత్రికి తీసుకెళ్లేలోపు మరణించారని చెప్పారు. 10 నిమిషాలు ముందు వస్తే ప్రాణాపాయం తప్పేదని వైద్యులు చెప్పారన్నారు. తండ్రి మరణం కలచివేసిందని, అందుకే ఉచిత బైక్ అంబులెన్స్ సేవలు ప్రారంభించామని వివరించారు. ప్రస్తుతం నరసరావుపేట, గుంటూరులో ప్రారంభించామని, కొద్ది రోజుల్లో గుంటూరు, పల్నాడు జిల్లాల్లోని ప్రముఖ పట్టణాలకు తమ సేవలు అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు.

కవి కరీముల్లాకు అవార్డు ప్రదానం

ప్రజశక్తి - వినుకొండ

పట్టణానికి చెందిన ప్రసిద్ధ కవి కరీముల్లాకు కడప జిల్లా ప్రొద్దుటూరులో ప్రతిష్టాత్మక ఎపిజె అబ్దుల్ కలాం అవార్డును ప్రదానం చేశారు. తెలుగు సాహిత్యంలో కరీముల్లాకు ఒక ప్రత్యేక స్థానం ఉందని, ఆయన సృష్టించిన అబాబీలు కవితా ప్రక్రియ ఈ తరం కవులకు ఉపయుక్తంగా ఉంటుందని అన్నారు. తెలుగు భాషకు సరికొత్త సొబగులద్దిని కరీముల్లా కవిత్వం అనేక భాషల్లో అనువాదమై ఎంతో పేరు తెచ్చిందని తెలిపారు. మన కాలం జాషువాగా కరీముల్లా ఖ్యాతి నొందారని కొనియాడారు. కార్యక్రమంలో రిటైర్డ్ డీఎస్పీ మహబూబ్ బాషా, ఉద్యోగుల సంఘం అధ్యక్షులు పి.సిద్ధయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్మారం బాజి, లాల్ వజీర్, వేంపల్లీ అబ్దుల్ ఖాదర్ పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగించాలి : నగర కమిషనర్

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో డ్రైన్లపై, రోడ్లమీద ఆక్రమణలను తొలగించాలని నగర కమిషనర్ పులిశ్రీనివాసులు పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. ఆదివారం కమిషనర్ నగరంలో పారిశుధ్యం పనుల తనిఖీ నిమిత్తం నగరంలోని పలు ప్రాంతాలలో పర్యటించారు. పర్యటనలో భాగంగా జిజిహెచ్, రైల్వే స్టేషన్ రోడ్, ఓల్డ్ క్లబ్ రోడ్ తదితర ప్రాంతాల్లో పారిశుధ్య పనులు, డ్రైన్ల ఆక్రమణలను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో డ్రైన్లపై ఆక్రమణల వలన వ్యర్థాలు అడ్డుపడి వర్షం నీరు రోడ్ల మీదకు, ఇళ్లల్లోకి వెళ్లి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆయా ప్రాంతాల్లో నిలిచిన నీటిని బెయిల్ అవుట్ చేయడానికి కూడా సాధ్యం కావడంలేదన్నారు. ప్రజల ఇబ్బందుల దష్ట్యా డ్రైన్ల ఆక్రమణలను వార్డు సచివాలయాల వారీగా పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులు సమన్వయంతో గుర్తించి, వాటి తొలగింపునకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అలాగే ట్రాఫిక్‌కు ఆటంకం కల్గించే విధంగా ఉన్న రోడ్లపై ఆక్రమణలను కూడా తొలగిస్తామన్నారు. నగర ప్రజలు కూడా ప్రధాన డ్రైన్లపై వివిధ వ్యాపారాల పేరుతో ఆక్రమణ చేసుకోవద్దని, తప్పనిసరిగా డ్రైన్‌కి వెనుక వైపు మాత్రమే ఏర్పాటు చేసుకోవాలన్నారు. డ్రైన్లమీద, డ్రైన్‌కి ముందుకు వచ్చి ఏర్పాటు చేసుకుంటే వెంటనే తొలగించడం జరుగుతుందన్నారు.

నేడు జిఎంసిలో గ్రీవెన్స్

జిఎంసి ప్రధాన కార్యాలయంలో అక్టోబర్ 14న ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకూ 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక' గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కమిషనర్ పులి శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ సమస్యలపై అర్జీలు నేరుగా గ్రీవెన్స్‌లో అందిం చవచ్చని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ కోరారు.

రాజధాని పారిశుధ్య కార్మికులపై వేధింపులు ఆపాలి

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధాని ప్రాంత పారిశుధ్య కార్మికులపై వేధింపులు ఆపాలని రాజధాని ఏరియా పారిశుధ్య కార్మిక సంఘం గౌరవ అధ్యక్షులు ఎం రవి డిమాండ్ చేశారు. సంఘం నాయకురాలు సుఖవేణి అధ్యక్షతన ఆదివారం తుళ్లూరులో రాజధాని ఏరియా కార్మికుల విస్తృత సమావేశంలో రవి ప్రసంగించారు. రాజధాని పారిశుధ్య కార్మికులకు జీతాలు తక్కువ, పని ఎక్కువ అని, గౌరవం తక్కువ, వేధింపులు ఎక్కువని అన్నారు. పెరుగుతున్న ధరలతో వేతనాలు సరిపోక, అవి కూడా సక్రమంగా రాక, కార్మికులు తీవ్రమైన ఆర్థిక సమస్యలతో, అప్పులతో, అర్థాకలితో జీవనం కొనసాగించాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. రాజధాని గ్రామాల పారిశుధ్య కార్మికుల ను ఆప్కాసులోకి తీసుకోవాలన్నారు. రాజధాని ప్రజల ఆరోగ్యాలు కాపాడేందుకు తమ ఆరోగ్యాన్ని పణంగా పెడుతున్న కార్మికులకు జీతం రూ.21 వేలు ఇవ్వాలని అన్నారు. చీటికిమాటికి కార్మికులను పని నుండితొలగిస్తామంటూ చేస్తున్న వేధింపులను ఆపాలని, కార్మికులకు పని భద్రత కల్పించాలన్నారు.గత ప్రభుత్వం కార్మికులకు నిలిపి వేసిన రాజధాని సామాజిక పెన్షన్‌ను పునరుద్ధ రించాలని కోరారు. రాజధానిలో భూమిలేని పేదలకు ఇస్తున్న రూ 5 వేల సామాజిక పెన్షన్ ను పారిశుధ్య కార్మికులకు కూడా ఇవ్వాలని కోరారు. అత్యవసర సమయాలలో కార్మికులు సెలవులు పెడితే నెలలో 4 ఆదివారాల జీతాన్ని కటింగ్ చేయడం అన్యాయం అని సి ఆర్ డి ఏ అధికారులు, సూపర్వైజర్లు రోజుకో కొత్త

మాట్లాడుతున్న ఎం రవి

రూల్ పెడుతూ అరకొర వస్తున్న కార్మికుల జీతాలుకు కన్నం పెడుతూ, కార్మికుల పొట్టలు కొడుతున్నారని విమర్శించారు.కార్మికులపై కొందరు సూపర్వైజర్లు పాల్పడుతున్న తీవ్రమైన వేధింపులను సి ఆర్ డి ఏ అధికారులు జోక్యం చేసుకొని ఆపాలని అన్నారు. సిఐటియు రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం భాగ్యరాజు మాట్లాడుతూ, రాజధానిలో అభివృద్ధి పనులు ప్రారంభం కాబోతున్న నేపథ్యంలో పారిశుధ్య కార్మికుల సంఖ్యను పెంచాలని అన్నారు. కార్మికులపై కక్ష సాధింపు చర్యల్లో భాగంగా ఇతర గ్రామాలకు కార్మికుల ను పంపించి ఇబ్బందులు పెట్టడం ఆపేయాలని కోరారు. తమిళనాడులో శ్యాంసంగ్ కార్మికులు చేస్తున్న ఆందోళనకు సమావేశం మద్దతు తెలుపుతూ తీర్మానం చేసింది. సమావేశంలో రాజధాని ఏరియా పారిశుధ్య కార్మిక సంఘం నాయకులు వీర్లంకమ్మ, దుర్గ, మాలతి, విజయ కుమారి,శేషయ్య, లక్ష్మణరావు, బుజ్జి, రూతమ్మ,మధురవాణి, సామ్రా జ్యం, దేవమాత, రత్నకుమారి,అరుణ, శివకుమారి, సామ్రాజ్యం, దేవి తదితరులు పాల్గొన్నారు.

అవయవ దానంతో నలుగురు జీవితాల్లో వెలుగులు

ప్రజాశక్తి-తాడేపల్లి

బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తి అతని కుటుంబ సభ్యుల అంగీకారంతో నలుగురు వ్యక్తులకు కొత్త జీవితాన్ని అందించారు. బాపట్ల జిల్లా, నిజాం పట్నానికి చెందిన చెన్ను శ్రీనివాసరావు (48) బైక్ పై ప్రయాణం చేస్తూ రెండు రోజుల క్రితం రోడ్డు ప్రమాదం జరిగి తీవ్ర గాయాల పాలయ్యాడు. కుటుంబ సభ్యులు వెంటనే స్థానిక మణిపాల్ ఆసుపత్రికి తరలించారు. శ్రీనివాసరావు ఆరోగ్య పరిస్థితిని సమీక్షించిన డాక్టర్లు వైద్య పరీక్షల అనంతరం శ్రీనివాసరావుకు బ్రెయిన్ డెడ్ అయినట్లు కుటుంబ సభ్యులకు తెలిపారు. శ్రీనివాసరావు భార్య విజయలక్ష్మి, కుమారులు సురేష్, సుబ్రహ్మణ్యం అంగీకారం మేరకు ఆంధ్రప్రదేశ్ జీవంధార్ చైర్మన్ డాక్టర్ కె రాంబాబు, ఆసుపత్రి హెడ్ డాక్టర్ సుధాకర్ కంటిపూడి ఆధ్వర్యంలో అవయవదానం చేయడానికి ముందుకు వచ్చారు. కాలేయం, రెండు కిడ్నీలు మణిపాల్ ఆసుపత్రి వారికి, కళ్ళను హైదరాబాదులోని ఎల్వి ప్రసాద్ కంటి ఆసుపత్రికి తరలించారు. అవయవదానం చేయటానికి ముందుకొచ్చిన కుటుంబ సభ్యులకు మణిపాల్ ఆసుపత్రి కృతజ్ఞతలు తెలిపింది.

మాట్లాడుతున్న డాక్టర్ రామకృష్ణ

చర్మ సమస్యల పట్ల జాగ్రత్తగా ఉండాలి

ప్రజాశక్తి-గుంటూరు

శరీరానికి రక్షణ కవచంలాంటి చర్మానికి సంబంధించిన వ్యాధులు, సమస్యల పట్ల నిర్లక్ష్యం తగదని, వృద్ధాప్యంలో చర్మంలోని ఇమ్యునిటీ మెకానిజం తగ్గటం వల్ల వచ్చే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సీనియర్ చర్మవ్యాధి నిపుణులు డాక్టర్ పి.వి.కె.ఆర్ రామకృష్ణ అన్నారు. అవగాహన ఆధ్వర్యంలో అరండల్‌పేటలోని సంస్థ కార్యాలయంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన ఆరోగ్య సభలో డాక్టర్ రామకృష్ణ మాట్లాడుతూ శరీరమార్పుల వల్ల నష్టం కలుగకుండా జాగ్రత్త పడాలన్నారు. పౌష్టికాహారం తీసు కోవటం, ఎండకి తిరగకుండా ఉండటం, చర్మాన్ని శుభ్రంగా ఉంచుకోవటం అవసరం అన్నారు. ధూమపానం, మద్యపానం వల్ల చర్మ దెబ్బతింటుందని, అటువంటి అలవాట్లు మానుకోవాలన్నారు. చర్మం పరిరక్షణలో నీటి పాత్ర ఎక్కువగా ఉంటుందని, మంచినీరు సరిపడా తాగాలన్నారు. చర్మ సౌందర్యం కోసం వివిధ కంపెనీలు విడుదల చేసే వాడటం వల్ల మంచికన్నా చెడే ఎక్కువని తెలిపారు. అనంతరం డాక్టర్ రామకృష్ణను అవగాహన సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో ఫణీంద్రకుమార్, తిరుమలరావు, శ్రీనివాస్ తదితరులు ప్రసంగించారు.

సూపర్ సిక్స్ అమలు చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి - తాడేపల్లి

ఎన్నికలకు ముందు తెలుగుదేశం ప్రభుత్వం ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలని సిపిఎం క్రిస్టియన్ పేట శాఖ మహాసభ తీర్మానించింది. ఇసుకపల్లి ఇసాక్ అధ్యక్షతన ఆదివారం తాడేపల్లి మేక అమరా రెడ్డి భవన్లో మహాసభ నిర్వహించారు. అర్హులైన వారందరికీ పింఛన్ల మంజూరు చేయాలని ఆసభ డిమాండ్ చేసింది. భవన నిర్మాణ కార్మికులకు ఇసుక అందుబాటులోకి తెచ్చి సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని, క్రిస్టియన్ పేటలో మున్సిపల్ ట్యాపుల ద్వారా ఇంటింటికి మంచినీరు అందించాలని, డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలని కోరింది.

మాట్లాడుతున్న బూరుగ వెంకటేశ్వర్లు

బైపాస్ రోడ్ లో పెద్ద ఎత్తున గేటెడ్ కమ్యూనిటీ అపార్ట్మెంట్స్ నిర్మాణం జరగటంతో వాటినుండి వచ్చే మురుగును ఎస్ టి పి లు ఏర్పాటు చేసి మురుగునీటిని శుద్ధి చేయాలని మహాసభ డిమాండ్ చేసింది. గతంలో పట్టణ పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అపార్ట్మెంట్లో మురుగునీరు బయటకు పోయేదానికి కృషి చేయడం జరిగిందని తెలిపింది. బైపాస్ తూర్పు పడమర వైపు ప్రయాణికులు సౌకర్యార్థం బస్ షెల్టర్లు ఏర్పాటు చేయాలని, బకింగ్ హామ్ కాలవపై ప్రస్తుతం ఉన్న వంతెన స్థానంలో రెండు లైన్ల వంతెన యుద్ధ ప్రాతిపదికన ఏర్పాటు చేయాలని, ప్రస్తుతం పేదలు నివసిస్తున్న చోటనే ఇళ్ల స్థలాలకు పట్టాలు ఇవ్వాలని మహాసభ తీర్మానించింది. అనంతరం శాఖ కార్యదర్శిగా వై. బర్నబాస్‌ను ఎన్నుకున్నారు. మహాసభలో సిపిఎం పట్టణ కార్యదర్శ బూరుగ వెంకటేశ్వర్లు, పట్టణ కమిటీ సభ్య దొంతి రెడ్డి విజయ భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లాం వద్ద వంతెనను పునర్‌నిర్మించాలి

ప్రజాశక్తి - తాడికొండ

శిథిలావస్థకు చేరుకున్న వంతెనల స్థానంలో నూతనంగా వంతెనలు నిర్మాణం చేపట్టాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కె అజయ్ కుమార్ అన్నారు. ఆదివారం తాడికొండలోని సినిమా హాల్ వద్ద ఏర్పాటు చేసిన శాఖా మహాసభల్లో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వంతెనలు పూర్తిగా మునిగిపోయి రాకపోకలకు అంతరాయం కలిగిందని అన్నారు. సుమారు రెండు రోజులు బాహ్య ప్రపంచానికి సంబంధం లేకుండా తాడికొండ, తుళ్లూరు ,అమరావతి మండలాల ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారని అన్నారు. లాం వద్ద ఉన్న వంతెనను పునర్ నిర్మించాలని దీనివలన నాలుగు మండలాల ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందని

మాట్లాడుతున్న కంచుమాటి అజయ్‌కుమార్

అన్నారు. తాడికొండ కంతేరుకు మధ్య ఎర్ర వాగు పై వంతెన పూర్తిగా దెబ్బతిని రోడ్డు కోతకు గురై భారీ గుంతలు ఏర్పడ్డాయని దాతలు సహకారంతో గుంతలు పూడ్చడం వలన రాకపోకలు యధావిధిగా సాగాయని అన్నారు. దీనికి శాశ్వత పరిష్కారం ప్రభుత్వం చూపాలని, రైతులతో సంబంధం లేకుండా కౌలు రైతులకు పంట నష్టపరిహారం చెల్లించాలని, తిరిగి పంట వేసుకోవడానికి సబ్సిడీపై విత్తనాలు ఎరువులు అందించాలని ఆయన డిమాండ్ చేశారు. తాడికొండలో చెంచు కాలనీలో కనీస సౌకర్యాలు కరువైయ్యాయని అన్నారు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వెంటనే రహదారుల నిర్మించి మురుగు పారుదలకు మురుగు కాలువలను నిర్మించాలని డిమాండ్ చేశారు. అనంతరం తాడికొండ శాఖా కార్యదర్శిగా చింతల భాస్కరరావు, జొన్నలగడ్డశాఖ కార్యదర్శిగా ఇమ్మడి రామారావు, మోతడక శాఖ కార్యదర్శిగా బాణావత్ భద్రయ్యలను ఎన్నుకున్నారు. కార్యక్రమ ంలో ఇమ్మడి రామారావు, మానవ భద్రయ్య చింతల భాస్కరరావు నాగేశ్వరరావు సరస్వతి మన మోహన్రావు పుల్ డేవిడ్ సంకూరు రాజు పాల్గొన్నారు.

21న గుంటూరులో సభ జయప్రదం చేయండి

ప్రజాశక్తి-తాడేపల్లి

సిపిఎం ఆధ్వర్యంలో ఈ నెల 21వ తేదీ గుంటూరులో సమకాలిన రాజకీయ పరిణామాలపై జరిగే సభను జయప్రదం చేయాలని కోరుతూ ఆదివారం తాడేపల్లి మేక అమరా రెడ్డి భవన్లో సిపిఎం నాయకులు కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ దేశంలో రాజకీయాలు శరవేగంగా మారు తున్నాయని చెప్పారు. ధరల పెరుగుదల గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రజలను ఇక్కట్లు పాలు చేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. మరోపక్క మతోన్మాదం హెచ్ మీరడం పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. 21వ తేదీ గుంటూరు వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జరిగే సభలో సిపిఎం పోలిట్ బ్యూరో సభ్యులు బివి రాఘవులు. ఎమ్మెల్సీ కె ఎస్ లక్ష్మణరావు. రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్ బాబురావు పాల్గొంటారని చెప్పారు. ప్రజలు పెద్ద ఎత్తు న పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ప్రాతూరు క్వారీలో కార్మికులకు పనులు కల్పించాలి

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

ప్రాతూరు ఇసుక క్వారీని తెరిపించి, కార్మికులకు పనులు కల్పించాలని సిపిఎం సీనియర్ నాయకులు జొన్న శివశంకరరావు అన్నారు. ఆదివారం రాత్రి ఎంటిఎంసి పరిధిలోని ప్రాతూరు సిపిఎం కార్యాలయం వద్ద సిపిఎం ప్రాతూరు గ్రామ శాఖ మహాసభ సిపిఎం నాయకులు డోకిపర్తి కోటయ్య అధ్యక్షతన జరిగింది. మహాసభలో శివశంకరరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల వాగ్దానంలో నూతన ఇసుక విధానాన్ని తీసుకువచ్చి, ఉచితంగా ఇసుకను ప్రజలకు అందజేస్తామని చెప్పి, మాట తప్పిందని అన్నారు. గత వైసిపి ప్రభుత్వం నూతన ఇసుక విధానాన్ని తీసుకువస్తామని చెప్పి, యంత్రాలతో ఇసుకను తోడి డంపు చేసి, ఇసుకను అధిక రేటుకు అమ్ముకుందని విమర్శించారు. ఇప్పుడు అధికారం లోకి వచ్చిన కూటమి ప్రభుత్వం కూడా గత వైసిపి ప్రభుత్వం మాదిరిగానే ఇసుకను ప్రజలకు అందుబాటులోకి తేకుండా, బడా కంపెనీలకు లాభం చేకూర్చే విధంగానే ఇసుకను

మాట్లాడుతున్న జొన్నా శివశంకరరావు

అమ్ముకుంటుందని ఆయన ఎద్దేవా చేశారు. తక్షణమే ప్రజలకు ఇసుకను అందుబాటులోకి తెచ్చి, భవన నిర్మాణ కార్మికులకు పనులు కల్పించే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని సిపిఎం పార్టీ డిమాండ్ చేస్తుందన్నారు. సిపిఎం తాడేపల్లి మండల కార్యదర్శి దొంతి రెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ 2004 కి ముందు ఏ విధంగా అయితే ఇసుక క్వారీ కార్మికులు పనిచేశారో ఆ విధంగానే క్వారీ అనుమతులు ఇచ్చి, యంత్రాలతో ఇసుకను తీయడం ఆపి, కార్మికులకు పని కల్పించాలని ఆయన అన్నారు. యంత్రాలతో పని చేయించడం వలన ప్రాతూరు, గుండి మెడ, చిర్రావూరు గ్రామాలలో ఇసుక క్వారీ కార్మికులు సుమారు 900 మందికి పైగా కార్మికులకు ఉపాధులు లేకుండా పోతున్నాయని మండిపడ్డారు. ట్రిబ్యునల్ కోర్టు తీర్పు ఆధారంగా భూగర్భ జలాలు ఇంకిపోకుండా, కార్మికులతోనే క్వారీలలో పని చేయించాలని సిపిఎం పార్టీ డిమాండ్ చేస్తుందన్నారు. అనంతరం మహాసభలో గ్రామ పరిధిలో ఉన్న ఇసుక క్వారీను తెరిపించాలని, గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థను పటిష్ట పరచాలని, పల్లంగా ఉన్న రోడ్లు నిర్మించాలని, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని పునరుద్ధించాలని పలు తీర్మానాలను మహాసభ ఏకగ్రీవంగా తీర్మానించింది. నూతన శాఖ కార్యదర్శిగా డోకిపర్తి రాజేంద్ర బాబును సభ్యులు ఎన్నుకున్నారు. ఈ మహాసభలో సిపిఎం తాడేపల్లి మండల నాయకులు పల్లె కృష్ణ, గ్రామ సిపిఎం నాయకులు దాసరి సురేష్, పోపూరి సుబ్బారావు, పోపూరి బిక్షాలు, నెమలి కంటి డేవిడ్, డోకుపర్తి దావీదు, కొలనుకొండ రాజేష్, బుర్ర రాజు తదితరులు పాల్గొన్నారు.

పల్నాడు విజ్ఞాన కేంద్రం కంటి వైద్యశిబిరం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పల్నాడు విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నరసరావుపేట ఎంవి రెడ్డి ఐ హాస్పిటల్ సౌజన్యంతో శనివారం నరసరావుపేట పట్టణం ఇస్లాంపేట శ్రీగిరి మున్సిపల్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఉచిత మెగా కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ వైద్య శిబిరంలో ఇస్లాంపేటతో పాటు, కోటప్పకొండ రోడ్డు, వెంగళరెడ్డి నగర్‌కు చెందిన 156 మంది వైద్య సేవలు పొందారు. ఎంవి రెడ్డి ఐ హాస్పిటల్ అధినేత్రి డాక్టర్ లంఘింశెట్టి సృజన వైద్య పరీక్షలు నిర్వహించి కాట్రాక్ట్, కంటి పొరలు, నీటికాసుల సమస్యలను గుర్తించి మందులు, కళ్లజోళ్లు ఉచితంగా పంపిణీ చేశారు. ఆపరేషన్‌లు అవసరమైన వారికి తమ హాస్పిటల్‌లో ఆరోగ్యశ్రీ కార్డు, అన్ని రకాల హెల్త్ ఇన్సూరెన్స్‌ల ద్వారా ఆపరేషన్ నిర్వహిస్తామని చెప్పారు. ఆరోగ్యశ్రీ కార్డు లేకపోయినా లాభాపేక్ష లేకుండా రాయితీపై నిర్వహిస్తామన్నారు. కంటి వ్యాధులకు సంబంధించి సూచనలు సలహాలు, ఈ సీజన్ లో వచ్చే కంటి వ్యాధుల గురించి వివరించారు. 40 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ 6 నెలలకు ఒకసారి విధిగా కంటి పరీక్షలు చేయించుకోవడం అవసరమన్నారు. సెల్‌ఫోన్‌ను మితిమీరి వినియోగించొద్దని సూచించారు. విజ్ఞాన కేంద్రం కార్యనిర్వాహక కార్యదర్శి షేక్ మస్తాన్‌వలి మాట్లాడుతూ పల్నాడు విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో పేదల సంక్షేమం కోసం ప్రతినెలా మొదటి ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం డాక్టర్ సృజనను పల్నాడు విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో సత్కరించారు. కమిటీ సభ్యులు ఎ.లక్ష్మీశ్వరరెడ్డి, కె.రామారావు, కె.కోటేశ్వరరావు, బి.నాగేశ్వరరావు, సుభాష్ చంద్రబోస్, వెంకటేష్ పాల్గొన్నారు.


డాక్టర్‌ను సన్మానిస్తున్న కేంద్రం సభ్యులు

కృష్ణమ్మలో బతుకమ్మ నిమజ్జనం

ప్రజాశక్తి - దాచేపల్లి

గురజాల నియోజకవర్గం దాచేపల్లి మండలంలో అన్ని గ్రామాలతోపాటు దాచేపల్లి నగర పంచాయతీలో ఘనంగా దసరా వేడుకలు ముగిశాయి. దసరా అనగానే గ్రామాల్లో బతుకమ్మను ఏర్పాటు చేసి తొమ్మిది రోజులపాటు వేడుకలు చేశారు. శనివారం ఊరేగిస్తూ కోలాటాలు, నృత్యాలతోపాటు, మహిళలందరూ పాల్గొని ఆయా గ్రామాల పరిధిలో ఉన్న కృష్ణానది నిమజ్జనం చేశారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా దాచేపల్లి సిఐ గుత్తి వెంకట్రావు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు చేశారు.

16న సెపక్ తక్రా జిల్లా జట్ల ఎంపిక

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

పల్నాడు జిల్లా సెపక్ తక్రా అసోసియేషన్ ఆధ్వర్యంలో సీనియర్స్ పురుషులు, మహిళల జిల్లా జట్ల ఎంపికలు సత్తెనపల్లి మండలం నందిగామ జెడ్‌పి పాఠశాలలో బుధవారం నిర్వహిస్తామని పల్నాడు జిల్లా సెపక్ తక్రా అసోసియేషన్ అధ్యక్షులు వి.పవన్ కుమార్ ఆదివారం తెలిపారు. ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు ఆధార్ కార్డుతో హాజరు కావాలని సూచించారు.

విలేజ్ పార్కుకు శంకుస్థాపన

ప్రజాశక్తి - పెదకూరపాడు

నియోజవకర్గ కేంద్రమైన పెదకూరపాడు ప్రగతికి, గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు దాతలు ముందుకు రావటం అభినందనీయమని టిడిపి జిల్లా కార్యదర్శి ఎ.రమేష్ అన్నారు. స్థానిక తాగునీటి చెరువు ప్రాంగణంలో గ్రామస్తులకు ఆహ్లాదం పంచేందుకు విలేజ్ పార్క్, శరీర దారుఢ్యం కొరకు జిమ్ ఏర్పాటు కోసం పెదకూరపాడుకు చెందిన మహిత రియల్‌ఎస్టేట్ అధినేత పొట్టి నాగమల్లేశ్వరరావు ముందుకు వచ్చారు. పనులకు ఆయన ఆదివారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు బి.రాంగోపాలరావు, జి.బాబు, సర్పంచ్ జి.రాజు, వి.అప్పారావు, న్యాయవాది కె.హనుమయ్య, కృష్ణమనేని చిన్న, వై.గంగ, డాక్టర్ చిన్నరాజు, వి.కిషోర్, వై.బ్రహ్మయ్య, ఎ.ప్రసాద్, ఎన్.బాజి, సిఐ అజయ్ పాల్గొన్నారు.

మండల పరిషత్ కార్యాలయం వద్ద నేడు ప్రజాదర్బార్

ప్రజాశక్తి-ఈపూరు

మండలంలోని బోడెశంభునివారిపాలెంలో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు సిమెంట్ రోడ్లు, సైడు కాల్వలకు సోమవారం శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం మండల ప్రజాపరిషత్ కార్యాలయం వద్ద ప్రజా సమస్యలపై ప్రజా దర్బార్‌లో పాల్గొంటారని ఎమ్మెల్యే కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది. ప్రజల నుండి వినతి పత్రాలను ఎమ్మెల్యే నేరుగా స్వీకరిస్తారని తెలిపారు. ప్రజలు సమస్యల అర్జీతోపాటు, ఆధార్ కార్డు, ఫోన్ నంబరు, సమస్యలకు సంబంధించిన ఆధారాలు జత చేసి అందజేస్తే నిర్ణీత సమయంలో పరిష్కరిస్తారని ప్రకటనలో పేర్కొన్నారు.

ఆపన్నహస్తంలా సిఎం సహాయనిధి : ఎమ్మెల్యే జీవీ

ప్రజాశక్తి - వినుకొండ

వైద్య అవసరాల్లో ఉన్న ఎంతో మందికి ఆపన్నహస్తంలా సిఎం సహాయనిధి ఆదుకుంటోందని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. వినుకొండ నియోజకవర్గానికి చెందిన నలుగురుకి రూ.7.37 లక్షల చెక్కులను ఆయన శనివారం అందజేశారు. పట్టణంలోని టిడిపి కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో నాగులవరానికి చెందిన గాదు చిన్న కొండయ్యకు రూ.2.80 లక్షలు, అగ్నిగుండాలకు చెందిన భూక్యా కోటి నాయక్‌కు రూ.1,02,619, కారుమంచికి చెందిన రావెళ్ల హనుమాయమ్మకు రూ.81 వేలు, వినుకొండ పట్టణానికి చెందిన పఠాన్ ఆయూబ్ ఖాన్‌కు రూ.2,74,380 చెక్కులను అందజేశారు. ఆరోగ్యశ్రీ పరిధిలోకి రాని ఆపరేషన్ చేయించుకున్న వారికి చెక్కులిచ్చామన్నారు. నియోజకవర్గం పరిధిలో ఇంకా ఎవరైనా అవసరం ఉంటే తన దృష్టికి తేవాలని సూచించారు.

ఎన్‌టిఆర్ ఆర్చ్ నిర్మాణానికి శంకుస్థాపన

చరిత్ర ఉన్నంత కాలం తెలుగుజాతి ఎప్పటికీ మరిచిపోలేని పేరు ఎన్టీఆర్ అని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు అన్నారు. నటుడిగా, ముఖ్యమంత్రిగా తెలుగువారి గుండెల్లో చెరగని ముద్రవేశారని కొనియాడారు. పట్టణంలోని సురేష్ మహల్ రహదారిలో ఆర్చ్ నిర్మాణానికి ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే శనివారం శంకుస్థాపన చేశారు. ఎన్టీఆర్ పేరుతో ఈ స్వాగత ద్వారాన్ని నిర్మిస్తున్నారు.

సీతారాం ఏచూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు, సభ్యులు

పట్టణ ప్రాంతాల్లోనూ ఉపాధి హామీని అమలు చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి - సత్తెనపల్లి

పట్టణంలోని వ్యవసాయ కార్మికులకు పనుల్లేక ఆర్థికంగా సతమతం అవుతున్నారని, పట్టణ ప్రాంతాల్లోనూ ఉపాధి హామీ పనులు కల్పించాలని సిపిఎం డిమాండ్ చేసింది. స్థానిక రంగా కాలనీలో 2వ వార్డు సిపిఎం మహాసభ వై.సాయిబాబు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.రవిబాబు మాట్లాడుతూ ఇసుక లేక భవన నిర్మాణాలు జరగక కార్మికులు అడ్డాల వద్ద పడిగాపులు కాయాల్సి వస్తోందన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు అధికంగా పెరగడంతో కుటుంబాల పోషణకూ కార్మికులు అప్పులు చేయాల్సి వస్తోందని చెప్పారు. ఇసుక సరఫరాను సరతరం చేసి అందరికీ అందుబాటులో ఉంచాలని, కార్మికులకు పనులు దొరికేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. నిత్యావసరాల ధరలను తగ్గించాడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సత్వరం పూనుకోవాలని డిమాండ్ చేశారు. రేషన్ షాపుల ద్వారా అన్ని రకాల నిత్యావసర వస్తువులను చౌక ధరలకు సరఫరా చేయాలన్నారు. ఈ మేరకు తీర్మానాలను మహాసభ ఆమోదించింది. ఎన్నికలప్పుడు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. అనంతరం నూతన కార్యదర్శిగా పరుచూరి కాశీని ఎన్నుకున్నారు. తొలుత సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. డి.నిర్మల, జె.రాజకుమార్, పి.సముద్రాలు, వి.పద్మ పాల్గొన్నారు.

జాతీయ నాయకుల విగ్రహాల ఆవిష్కరణ

ప్రజాశక్తి - మాచర్ల

డాక్టర్ ఏపీజే అబ్దులకలాం 94వ జయంతి ఉత్సవాల సందర్భంగా స్వామి వివేకానంద చారిటబుల్ ట్రస్ట్ మాచర్ల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్వామి వివేకానంద సేవాశ్రమంలో ఆదివారం ఐదుగురి జాతీయ నాయకుల విగ్రహాలను ఏర్పాటు చేశారు. ట్రస్ట్ వ్యవస్థాపక చైర్మన్ మెట్టు గోవిందరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథులూగా రిటైర్డ్ డిప్యూటీ డిఇఒ రామకృష్ణ, రోటరీ క్లబ్ మీనాక్షి హాస్పిటల్ చైర్మన్ చిరుమామిళ్ల కృష్ణయ్య, పోలిశెట్టి పిచ్చయ్య, మీనాక్షి కంటి ఆస్పటల్ డైరెక్టర్, రోటరీ క్లబ్ సీనియర్ లక్ష్మీనారాయణ, పల్నాడు వికాస్ ప్రతిభ కాలేజీ చైర్మన్ షేక్ నాగూర్ వలి, స్టేట్ బ్యాంకు ఉద్యోగి శర్మ హాజరై విగ్రహాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భరతమాత ముద్దుబిడ్డలైన జాతీయ నాయకులకు విగ్రహాలు ఏర్పాటు చేయటం సేవాశ్రమంలోని పిల్లలకు, వద్దులకు ఆదర్శంగా ఉంటుందని భావితరాల వారికి ఆదర్శంగా నిలుస్తాయని చెప్పారు. 20 ఏళ్ల నుండి మెట్టు గోవిందరెడ్డి మాచర్ల, పరిసర గ్రామ ప్రజలకు చేస్తున్న సేవలను అభినందించారు. దాతలు రామకృష్ణ, కొప్పునూరు జెడ్‌పి హైస్కూల్ హెచ్‌ఎం ఐవి నాగమణి దంపతులు, పోలిశెట్టి పిచ్చయ్య, ముత్యాల పాపిరెడ్డి, అల్లం సోరీలుటీచం, జక్కిరెడ్డి సత్యనారాయణరెడ్డి, జిల్లెలమూడి రామకోటమ్మ కుటుంబ సభ్యులు, మెట్టు రఘురాంరెడ్డి, మెట్టు శివారెడ్డిని అభినందించారు. కార్యక్రమంలో కజ్జం సైదయ్య, టీచర్ గంట్రకోట ప్రసాద్, సుబ్బారావు, రామాంజి, టీచర్ నాగసురేష్, కొమర కాశీ, సుశీల, సంగీత ఉపాధ్యాయులు లాల్ సాహెబ్, ఈశ్వరరావు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీలకు డీఎస్సీ ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రాష్ట్ర ప్రభుత్వం, సాంఘిక సంక్షేమ శాఖ, గిరిజన సంక్షేమ శాఖ ఉత్తర్వుల మేరకు, రాష్ట్రంలో షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల అభ్యర్థులకు డీఎస్సీ పరీక్ష కోసం ఉచిత భోజనం, వసతి సౌకర్యాలతో కూడిన 3 నెలల పాటు శిక్షణ పొందుటకు http://jnanabhumi.ap.gov.in ద్వారాదరఖాస్తుకు ఈ నెల 22 తేదీలోగా నమోదు చేసుకొవాలని పల్నాడు జిల్లా జిల్లా ఎస్‌సి వెల్ఫేర్, సాధికారిత అధికారి, సాంఘిక సంక్షేమ శాఖ సంయుక్త ప్రకటన విడుదల చేశారు. ఎస్‌జిటిలకు ఇంటర్మీడియట్‌తో పాటు డైట్‌సెట్, టెట్, స్కూల్ అసిస్టెంట్స్‌కు డిగ్రీ గ్రాడ్యుయేషన్, బిఈడి, టెట్ విద్యార్హతలతో పాటు కుటుంబ వార్షిక ఆదాయం రూ.2.50 లక్షలలోపు కలిగిన విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. ఆన్‌లైన్,ఆఫ్‌లైన్ పరీక్ష ద్వారా ఎంపికలు ఉంటాయని, ఉచిత శిక్షణను అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఈ నెల 22 నుండి 25 లోగా హాల్ టికెట్స్ డౌన్ లోడింగ్ చేసుకోవాలని 27న పరీక్ష, 28న ఫలితాల ప్రకటన, 30న జిల్లాల వారీగా ఎంపికైన వారి జాబితా ప్రకటన, వచ్చే నెల 3న కోచింగ్ సెంటర్ వారీగా అభ్యర్థుల ఎంపిక, 6వ తేదీ నుండి ఉచిత వసతితో కూడిన ప్రారంభం అవుతుందని వివరించారు.

ఇసుక బస్తా @ రూ. 150

ప్రజాశక్తి - తాడేపల్లి

ప్రస్తుతం ఇసుక చేతికి దొరకటం లేదు. పట్టుకుందామంటే బంగారం లాగా మండిపోతుంది. ఇసుక దొరకడం గగనంగా ఉండటంతో పాటు అత్యవసరమై బస్తా రూ.150 లేదా 200లకు కొనాల్సివస్తుందని, అది కూడా లభ్యం కావడం లేదని వినియోగదారులు వాపోతున్నారు. ప్రస్తుత పరిస్థితిలో ప్రభుత్వం పై గృహవినియోగదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వం నిర్ణయించిన ధరకంటే ప్రస్తుతం అధికంగా డబ్బులు వెచ్చించి కొనుగోలు చేయాల్సి వస్తుందని, అది కూడా వెంటనే దొరుకుతుందా అంటే నమ్మకం తక్కువే. ట్రాక్టర్ ఇసుక కొనుగోలు రూ.పదివేలు ఇస్తామంటే గంటలో ఇంటి ముందుకు వచ్చి చేరుతుంది. అదేమని ఎవరైనా అడిగితే నదులకు వరదలు వస్తున్నాయి కదా. నదిలోకి వెళ్లడానికి దారులు లేవు కదా. కొద్ది రోజులు ఓపిక పడితే అన్ని సర్దుకుంటాయని తమ్ముళ్లు చెప్తున్నారు. మరి బ్లాక్ మార్కెట్లో ఎలా వస్తుందంటే నాలుకలు చప్పరిస్తున్నారు. అయినా విజన్ 20 20, విజన్ 20 47 అని లెక్కలు వేస్తున్న ప్రభుత్వానికి వర్షాకాలంలో నదులకు వరదలు వస్తాయని, వర్షాలు కురుస్తాయని తెలియదా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కొత్త ప్రభుత్వం వస్తే నిర్మాణరంగం కొత్త పుంతలు తొక్కుతుందనుకున్నా వారికి ప్రస్తుతం నిరాశ నిస్పృహలు కనిపిస్తున్నాయి. అవసరం మేరకు వర్షాకాలంలో ఇసుక స్టాక్ పెట్టుకోవడం తెలీదా అని సామాన్యుల ప్రశ్న. గత నెలరోజుల నుండి తాడేపల్లి ప్రాంతంలో ఇసుక కొరత అనేక బాలారిష్టాలను ఎదుర్కొంటుంది. దీనివల్ల చిన్నపాటి మరమ్మతులు చేసుకోవాలని భావిస్తున్న మధ్యతరగతి ప్రజలు ఇసుక దొరక్క తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిర్మాణ కార్మికులకు వారంలో మూడు రోజులు మాత్రమే పని దొరుకుతుందని వాపోతున్నారు. ఇసుకష్టలు త్వరగా తీర్చే తమకు పనులు కల్పించాలని నిర్మాణ కార్మికులు కోరుతున్నారు.

ఇసుక అక్రమ తవ్వకాలు

మండలంలో నాలుగు ఇసుక క్వారీలు ఉన్నాయి. ప్రస్తుతం మూడు రిచ్ లో యదేచ్ఛగా అక్రమ రవాణా జరుగుతుంది. రాత్రి వేళల్లో ట్రాక్టర్ల ద్వారా భారీగా తరలిస్తున్నారు. అలా తరలించిన ఇసుకను తమకు అనుకూలమైన ప్రదేశంలో నిలవబెట్టి అమ్మకాలు సాగిస్తున్నారు. అక్రమ అమ్మకాల ద్వారా తెలుగు తమ్ముళ్లు లక్షలాది రూపాయలు వెనకేసుకుంటున్నారు. ఇటీవల రెండు వర్గాల మధ్య విభేదాలు రావటంతో ఒక వర్గం తాడేపల్లి ఎమ్మార్వోకు అక్రమ ఇసుక రవాణా గురించి ఫిర్యాదు చేసింది. స్పందించిన ఎమ్మార్వో తమ సిబ్బందితో వెంటనే దాడులు చేసి రెండు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఎమ్మార్వో హెచ్చరించారు. రాత్రి వేళల్లో గట్టిగా ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

అలరించిన బతుకమ్మ పాటలు

ప్రజాశక్తి-తాడేపల్లి

తెలంగాణలో ప్రజలు అత్యంత ఇష్టంగా జరుపుకునే బతుకమ్మ సందడి తాడేపల్లిలో బతుకమ్మ పాటలు ద్వారా అలరించాయి. పట్టణంలోని పోలకంపాడు వినుకొండ అంకాలమ్మ గుడి లో దసరా సందర్భంగా బతుకమ్మ పాటలతో పాటు నత్యాలు ఆకట్టుకున్నాయి. చిన్నారులు ప్రదర్శించిన కోలాటం హైలెట్గా నిలిచింది. కార్యక్రమం విజయవంతమైనట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు.

కృష్ణానదిలో తెప్పోత్సవం రద్దు

ప్రజాశక్తి-తాడేపల్లి

దసరా సందర్భంగా ప్రతి సంవత్సరం కృష్ణా నదిలో జరిగే తెప్పోత్సవం ఈ సంవత్సరం రద్దు చేశారు. కృష్ణా నదిలో నీటి ప్రవాహం అధికంగా ఉండటంతో పాటు పైనుండి 40 వేల క్యూసెక్కులు నీరు రావడంతో ఇరిగేషన్ మరియు దేవాదాయ శాఖ అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. తెప్పోత్సవానికి హంస వాహనం కూడా అంగరంగ వైభవంగా తయారైన తర్వాత తెప్పోత్సవం రద్దు అని ప్రకటించడంతో యాత్రికులు కొంతమేర అసంతప్తి వ్యక్తం చేస్తున్నారు.

నేటి నుండి మండలంలో పల్లె పండుగ

ప్రజాశక్తి - దుగ్గిరాల : మండలంలోని గ్రామాలలో సోమవారం నుండి పల్లె పండుగ కార్యక్రమాన్ని ప్రారంభించ నున్నట్లు ఎంపీడీవో అడిగోపుల శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం పెద్ద కొండూరు గోదావరి వీర్లపాలెం గ్రామాలలో ఈ కార్యక్రమం నిర్వహిస్తు న్నామని తెలిపారు. పెద్ద కొండూరు లో రూ.15 లక్షలతో రెండు డొంక రోడ్లు, వీర్లపాలెం గ్రామంలో ఐదు లక్షలతో డొంక రోడ్డు కు శంకుస్థాపన నిర్వహిస్తారని తెలిపారు. మండల వ్యాప్తంగా రూ. 3 కోట్ల 35 లక్షలతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించ నున్నారని ఎంపిడిఒ తెలిపారు.

కేక్ కట్ చేస్తున్న బాలకృష్ణ

'జొన్నాదుల' పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో టీడీపీ బీసీ సెల్ ఆధ్వర్యంలో జిల్లా టీడీపీ పద్మశాలియ సాధికారిక సభ్యులు జొన్నాదుల బాలకృష్ణ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కేక్‌ను బాలకృష్ణ కట్ చేశారు. టీడీపీ నాయకులు గోవాడ దుర్గారావు, వాకా మాధవరావు, అన్నం నాగబాబు, జొన్నాదుల వెంకట రామాంజనేయులు, గోసాల రాఘవ, చిమట కోటేశ్వరరావు, జంజనం వెంకట సుబ్బారావు, నందం బాబురావు, ఆకురాతి లక్ష్మణ్, బిట్రా సుబ్రమణ్యం, గుంటి నాగరాజు, వెనిగళ్ళ నవీన్, దామర్ల కోటేశ్వరరావు, రాజేష్ తదితరులు బాలకృష్ణకు అభినందనలు తెలిపారు.

అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన రమేష్ బాబు

శ్రీ అఖిలాండేశ్వరి అమ్మవారి దేవస్థానంలో అన్నదానం

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి శ్రీ అఖిలాండేశ్వరి అమ్మవారి దేవస్థానంలో శ్రీ దేవి శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా శనివారం విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకొని అమ్మవారిని శ్రీ రాజరాజేశ్వరి దేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ధర్మకర్త కాలారి సుబ్బారావు, శ్రీమతి వసంత దంపతులు మాజీ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ మన్నెం రమేష్ బాబు, భక్త బృందం ప్రతినిధులు అన్నపురెడ్డి రామకష్ణారెడ్డి, కదం రాంబాబు, చాగంటి కృష్ణారెడ్డి, గోవాడ రవి తదితరులు పాల్గొన్నారు.

కళ్ళజోళ్ళు పంపిణీ చేస్తున్న నాగార్జున

ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి పట్నంలోని రామనాధం చిన్నకోటయ్య శివపార్వతమ్మ వృద్ధుల సేవాశ్రమంలో ఆదివారం వృద్ధులకు నిత్యాన్నదాన కార్యక్రమం, 3వ వార్షికోత్సవం, 111వ నేత్ర పరీక్ష శిబిరంలో ఉచిత కళ్ళజోళ్ళు పంపిణీ కార్యక్రమం ఆశ్రమ అధ్యక్షులు రామనాధం వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగింది. కార్యక్రమంలో రాష్ట్ర పద్మశాలి డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కందుల నాగార్జున, రామనాథం పూర్ణచంద్రరావు, ఆకురాతి శంకరరావు, దీపాల సాంబ శివరావు, ఆలపాటి రాధిక, రామనాథం పరమేశ్వరరావు, రంగనాయకి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

ప్రజాశక్తి-తాడేపల్లి

పట్నంలోని యానాదులు కాలనీ (అంబేద్కర్ కాలనీ) లోని పేదలకు ఆదివారం ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ స్ఫూర్తితో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా అక్కడ ఉన్న అమ్మవారికి సారి సమర్పించారు. ఈ కార్యక్రమంలో తాడేపల్లి టిడిపి పట్టణం అధ్యక్ష లు వల్లభనేని వెంకట్రావు. సీనియర్ నాయకులు కేలి వెంకటేశ్వరరావు. డి దాసు. ఈ పెంచలయ్య. ఏ మురళి. కె వెంకట్. కె విజయ్ బాబు. సాగర్. జి నాగేశ్వరరావు. ఎస్ కిరణ్. అమీర్. డి హరికష్ణ. వి పథ్వీరాజు. శ్రీనివాస్. కరిముల్లా. విమల్. పజిల్. అశోక్ తదితరులు పాల్గొన్నారు.

19న తెనాలికి రానున్న రోటరీ గవర్నర్

ప్రజాశక్తి - తెనాలి : రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం సమావేశము స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులోని గౌతమ్ హోటల్ లో ఆదివారం జరిగింది. ఈనెల 19న పట్టణానికి రోటరీ డిస్ట్రిక్ట్ 3150 గవర్నర్ కాట్రగడ్డ శరత్ చౌదరి రానున్న సందర్భంగా ఏర్పాట్లపై చర్చించారు. రావి సాంబయ్య మున్సిపల్ హైస్కూల్లో డైనింగ్ హాలు, సైకిల్ స్టాండ్ కు శంకుస్థాపన, మన డివిజన్లోని ప్రైమరీ హెల్త్ సెంటర్లు, వికలాంగులు కు 25 వీల్ చైర్లు పంపిణీ, చేతి వత్తుల వారికి అవసరమైన పనిముట్లు పంపిణీ జరుగుతుందని, క్లబ్ అధ్యక్షులు ఈదర శ్రీనివాస రావు, కార్యదర్శి దేవయేజనం మురళీకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో కోశాధికారి రమేష్ కుమార్ జైన్, ఈదర వెంకట పూర్ణ చంద్, కన్నెగంటి మురళీకష్ణ, గుత్తా వెంకటరత్నం, డాక్టర్ రవీంద్రనాథ్, చేతన్ రాజ్ కొఠారి, డాక్టర్ జీవన్ లత, జగదీశ్వరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన మంగళగిరి కబడ్డీ లీగ్-2024 పోటీలు

- **పురుషుల విభాగంలో తూర్పుగోదావరి జట్టు ప్రథమ స్థానం కైవసం**
- **మహిళ విభాగంలో విజేతగా నిలిచిన విజయనగరం జట్టు**

విజేతలకు బహుమతులను అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - మంగళగిరి

విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ సహకారంతో మంగళగిరిలో నిర్వహించిన మంగళగిరి కబడ్డీ లీగ్ పోటీలు శనివారం రాత్రితో విజయవంతంగా ముగిశాయి. గత నాలుగు రోజులుగా ప్రైడ్ ఆఫ్ మంగళగిరి పేరుతో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పురుషులు, మహిళల కబడ్డీ పోటీలు శనివారం రాత్రితో ముగిశాయి. విజేతలకు బహుమతులను అందజేశారు. ఉమ్మడి 13 జిల్లాల నుంచి 336 మంది క్రీడాకారులు ఈ పోటీలకు హాజరయ్యారు. పురుషుల విభాగం ఫైనల్ మ్యాచ్‌లో కృష్ణా జట్టుపై తూర్పుగోదావరి జట్టు 15-18 తేడాతో గెలుపొందింది. ద్వితీయ స్థానంను కృష్ణా, తృతీయ స్థానంను గుంటూరు జట్లు కైవసం చేసుకున్నాయి. మహిళా విభాగం ఫైనల్ మ్యాచ్‌లో కృష్ణా జట్టుపై విజయనగరం జట్టు 8-31 తేడాతో గెలుపొందింది. ద్వితీయ స్థానంను కృష్ణా, తృతీయ స్థానంను చిత్తూరు జట్లు కైవసం చేసుకున్నాయి. మహిళా, పురుషుల విభాగాలలో కూడా కృష్ణా జిల్లా ద్వితీయ స్థానం కైవసం చేసుకుంది. గెలుపొందిన విజేతలకు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు ట్రోఫీలు, నగదు బహుమతులు ప్రధానం చేశారు. మంత్రి నారా లోకేష్ స్ఫూర్తితో కబడ్డీ పోటీలకు ఈవెంట్ స్పాన్సర్‌గా మురళీకృష్ణ యార్లగడ్డ (మార్కోరోస్) వ్యవహరించారు. బహుమతులు అందజేసిన సభలో ఆంధ్రప్రదేశ్ పద్మశాలి వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్ధయ్య, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ చిల్లపల్లి శ్రీనివాసరావు, గుంటూరు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్న ప్రతిసారి తమ నైపుణ్యాలను పెంచుకోవాలని తెలిపారు. క్రీడలకు కూటమి ప్రభుత్వం ఎంతో ప్రోత్సాహాన్ని అందిస్తుందని వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. క్రీడాకారులను ప్రోత్సహించాలన్న ఉద్దేశ్యంతో మంత్రి నారా లోకేష్ ప్రతి సంవత్సరం వివిధ రకాల టోర్నమెంట్స్‌ను నిర్వహించడంతో పాటు తాడేపల్లి, మంగళగిరి టౌన్ లో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేశారని చెప్పారు. మంగళగిరిని క్రీడా హబ్‌గా చేయడంతో పాటు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో క్రీడాకారులు రాణించడమే మంత్రి నారా లోకేష్ లక్ష్యమన్నారు. మంగళగిరిని దేశంలోనే అగ్రస్థానంలో ఉంచడానికి మంత్రి నారా లోకేష్ కృషి చేస్తున్నట్లు తెలిపారు. వైసీపీ రాష్ట్రంలో సరైన క్రీడలు నిర్వహించిన దాఖలాలు లేవన్నారు. ఏపీని గంజాయి ఆంధ్రప్రదేశ్‌గా మార్చేశారని వారు విమర్శించారు.

ఆర్ఆర్ కన్వెన్షన్ లో ఎన్నికైన ఆంధ్రప్రదేశ్ పద్మశాలి సంఘం

రాష్ట్ర కన్వీనర్‌గా జీవీ నాగేశ్వరావు ఎన్నిక

ప్రజాశక్తి - మంగళగిరి

ఆంధ్రప్రదేశ్ పద్మశాలి సంఘం రాష్ట్ర కన్వీనర్‌గా జీవి నాగేశ్వరావు, కోకన్వీనర్‌గా మునగపాటి వెంకటేశ్వరరావు ఎన్నికయ్యారు. ఆదివారం రాష్ట్రంలో ఉన్న మూడు పద్మశాలి సంఘాల ఎన్నిక మంగళగిరి ఆర్ ఆర్ కన్వెన్షన్ లో పద్మశాలి పెద్దల సమక్షంలో నిర్వహించారు. కో కన్వీనర్లుగా భీమనపల్లి వెంకటసుబ్బయ్య, గిడుతూరి రాము, కొంకటి లక్ష్మీ నారాయణ, అందే జగదీష్, కస్తూరి వెంకటేశ్వరరావు, బండారు బెనర్జీ బాబు, సింగరి లక్ష్మీనారాయణ, కొప్పుల రమేష్, చిలివేరు దశరథరామయ్య లను ఎన్నుకున్నారు. గౌరవ సలహాదారులుగా 18 మందిని ఎన్నుకోవడం జరిగింది. ఈ కమిటీ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో జిల్లా కమి టీలు, గ్రామ కమిటీ లేసి, ఎన్నిక ద్వారా రాష్ట్ర అధ్యక్షున్ని ఎన్నుకోవడం జరుగుతుందని కో కన్వీనర్ ఎం వెంకటేశ్వరవు తెలిపారు.

అవయవదాతల సంఘం రాష్ట్ర అధ్యక్షులుగా యశస్వి రమణ

ప్రజాశక్తి-గుంటూరు

డాక్టర్ యశస్వి రమణకు నియామక పత్రం అందచేస్తున్న సీతామహాలక్ష్మి

ఆంధ్రప్రదేశ్ శరీర, అవయవ దాతల సంఘం రాష్ట్ర అధ్యక్షులుగా గుంటూరు ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ (జిజిహెచ్)ఆర్థోపెడిక్ విభాగాధిపతి డాక్టర్ యశస్వి రమణ బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు గుంటూరు జిల్లాలో శనివారం జరిగిన ఒక కార్యక్రమంలో అఖిల భారత శరీర అవయవ దాతల సంఘం వ్యవస్థాపకురాలు, సావిత్రిబాయి పూలే ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్ (స్పెక్ట్) చైర్ పర్సన్ గూడూరు సీతామహాలక్ష్మి నియామక ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డాక్టర్ యశస్వి రమణ గుంటూరులో అర్థోపేడిక్ సర్జన్‌గా ఎంతో సుప్రసిద్ధులు అని, అదే విధంగా 'వాక్ ఫౌండేషన్' ద్వారా సమాజానికి అంతే గొప్పసేవలు అందిస్తున్నారని తెలిపారు. అంతేకాకుండా సాహిత్య రంగంలో గొప్ప కవిగా, రచయితగా తనదైన ముద్ర వేసుకున్నారని గుర్తు చేశారు. బహుముఖ ప్రజ్ఞాశాలి అయిన రమణ యశస్వి ఇప్పటి వరకూ అనేక సేవా సంస్థలు, ప్రభుత్వాలు అందజేసిన విశిష్ట పురస్కారాలు వందకిపైగా ఉన్నాయన్నారు. సావిత్రిబాయి పూలే ఎడ్యుకేషనల్ - చారిటబుల్ ట్రస్ట్ ద్వారా కూడా విశిష్ట సేవా పురస్కారం అందించినట్లు చెప్పారు. గత 15ఏళ్లుగా గుంటూరు జిల్లా శరీర, అవయవ దాతల సంఘ అధ్యక్షులుగా ఎనలేని సేవలు అందించిన డాక్టర్ యశస్వి నేటినుండి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడుగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఆయనకు సీతామహాలక్ష్మి అభినందించారు. రమణ నాయకత్వంలో రాష్ట్రంలో శరీర, అవయవ దానం ఉద్యమం మరింత ముందుకు వెళుతుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎం. రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం సీతామహాలక్ష్మినీ యశస్వి రమణ శాలువాతో సత్కరించి, ధన్యవాదాలు తెలిపారు.

పేదలకు చేరువలో అధునాతన వైద్య సేవలు

ప్రజాశక్తి-గుంటూరు

హాస్పిటల్ భవనాన్ని పున:ప్రారంభిస్తున్న ఎమ్మెల్యేలు

స్థానిక ఏటి అగ్రహారంలో మూడున్నర దశాబ్దాలకుపైగా పేద మధ్యతరగతి వర్గాలకు వైద్య సేవలు అందిస్తున్న రవి హాస్పిటల్స్ నూతన భవనంలో అధునాతన సౌకర్యాలతో ప్రజలకు చేరువ కావటం అభినందనీయమని సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు పేర్కొన్నారు. స్థానిక ఏటి అగ్రహారం మెయిన్ రోడ్డు మూడోలైను సెమీ సూపర్ స్పెషాలిటీ రవి హాస్పిటల్స్‌ను ఎమ్మెల్యే లక్ష్మీనారాయణ, డాక్టర్ అరవింద్ బాబు, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అప్పిరెడ్డి మాట్లా డుతూ కీర్తిశేషులు చదలవాడ జగన్నాథం మాస్టర్ శిష్యరికంలో పెరిగిన తమకు వారి కుమారుడైన డాక్టర్ రవీంద్రనాథ్, మనుమడు డాక్టర్ నాగార్జున ఇతర వైద్య కుటుంబ సభ్యుల సారధ్యంలో రవి హాస్పిటల్స్ మరింతగా వైద్య సేవల ద్వారా ప్రజల అభిమానం పొందాలని కోరారు. ఆసుపత్రి నిర్వాహకులు డాక్టర్ రవీంద్రనాథ్, డాక్టర్ నాగార్జున మాట్లాడుతూ సాధారణ వైద్య సేవలతోపాటు అధునాతన ఆపరేషన్ థియేటర్, ఐసీయూ, ఏసి, సాధారణ వార్డులు, క్లినికల్ లేబరేటరీ, ఫార్మసీ, ఎమర్జెన్సీ సర్వీసుల కోసం అంబులెన్స్ సౌకర్యాలను అందుబాటులో ఉంచామని వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ డి.శరణ్య, డాక్టర్ కె.వెంకట్‌రామ్, డాక్టర్ డి.మీనాక్షిప్రణవి, చదలవాడ వేణు, నగరంలోని ప్రముఖ వైద్యులు, కార్పొరేటర్లు, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, డాక్టర్ రవీంద్రనాథ్, డాక్టర్ నాగార్జునులకు శుభాకాంక్షలు, అభినందనలు తెలియజేశారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఇమామ్ బాషా

హైస్కూల్స్‌కు ఉర్దూ బిఇడి పోస్టులు మంజూరు చేయాలి

ప్రజాశక్తి-గుంటూరు : రాష్ట్రంలోని ప్రతీ హైస్కూల్‌లో హిందీ, ఇంగ్లీష్ భాషలకు ఏ విధంగా బి.ఈడి.పోస్టులు ఉన్నాయో అదే విధంగా ఉర్దూ బి.ఈడి పోస్టులు మంజూరు చేసి, వాటిని భర్తీ చేయాలనీ రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ (రూట) రాష్ట్ర అధ్యక్షులు ఎమ్.ఎస్.ఇమామ్ బాషా ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం గుంటూరులోని జిల్లా రూట కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు అబ్దుల్ షజీర్ అధ్యక్షతన నిర్వహించిన ఉర్దూ ఉపాధ్యాయుల సమావేశంలో ఇమామ్‌భాషా ముఖ్య వక్తగా ప్రసంగిం చారు. స్టేట్ అసోసియేట్ ప్రెసిడెంట్ ఎస్.ఎమ్.డి. గయాజ్ మాట్లాడుతు ఉర్దూ అంగన్వాడీ సెంటర్ లను ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం రూట జిల్లా ఎన్నికలు జరిగాయి. జిల్లా అధ్యక్షులుగా సయ్యద్ సమీఉల్లాహ్, ప్రధాన కార్యదర్శిగా షేక్.రోషన్ జమీర్, ఆర్థిక కార్యదర్శిగా అబ్దుల్ షజీర్, మరో 12 మంది కార్యవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా ఎం.ఎస్. ఇమామ్‌బాషా వ్యవహారించారు.సమావేశంలో జాకీర్ హుస్సేన్, మహబూబ్ బాషా, ఇతర ఉర్దూ టీచర్లు పాల్గొన్నారు.

నీటి సంఘాల ఎన్నికలకు ఏర్పాట్లు

- రైతులు, కౌలు రైతులకు ఓటు హక్కు ఇస్తారు
- 40 రోజుల పాటు ప్రక్రియ కొనసాగింపు
- ప్రజాశక్తితో జలవనరుల శాఖ ఎస్ఇ ఉమామహేశ్వరరావు

ఉమామహేశ్వరరావు

నీటి సంఘాలు (వాటర్ యూజర్స్ అసోసియేషన్) డిస్ట్రిబ్యూటరీ, ప్రాజెక్టు కమిటీలకు ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నామని గుంటూరు జిల్లా జలవనరుల శాఖ సూపరింటెండెంట్ ఇంజినీరు ఉమామహేశ్వరరావు తెలిపారు. ఈనెల 16న ప్రాథమికంగా నోటిఫికేషన్ జారీ అవుతుందని ఆ తరువాత ఈ ప్రక్రియ ప్రారంభం అవు తుందన్నారు. ఈ ప్రక్రియ ఈనెల 16 నుంచి వచ్చేనెల 24 వరకు కొనసాగుతుందన్నారు. ప్రజాశక్తి ప్రతినిధికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పలు అంశాలు తెలియజేశారు.

జిల్లాలో ఎన్ని సంఘాలకు ఎన్నికలు జరుగుతాయి?

జిల్లాలో 160 నీటి సంఘాలు ఉన్నాయి. 22 డిస్రిబ్యూటరీ కమిటీలకు ఎన్నికలు జరగనున్నాయి. వచ్చే నెల 24న కృష్ణా పశ్చిమ డెల్టా ప్రాజెక్టు కమిటీకి ఎన్నికలు నిర్వహిస్తాం. గత ఆరేళ్లలో కొత్త ఆయకట్టురాలేదు. దీంతో గతంలో ఉన్న పరిధిలోనే 160 నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తున్నాం.

ఓటర్లుగా ఎవరుంటారు?

160 నీటి సంఘాల ఎన్నికల్లో పాల్గొనే ఓటర్లుగా రైతులు, కౌలు రైతులు ఉంటారు. వీరి జాబితాను స్థానిక రెవెన్యూ అధికారులు రూపొందిస్తారు. సిసిఆర్‌సి ఉన్న కౌలు రైతులకు కూడా ఓటు హక్కు ఉంటుంది. 2015లో జరిగిన పద్ధతి ప్రకారమే ఇప్పుడు ఎన్నికలు జరుగుతాయి. ఆయకట్టు పరిధిలో పొలం ఉండే రైతులు, కౌలు రైతులను మాత్రమే ఆయా నీటి సంఘాల్లో సభ్యులుగా పరిగణిస్తారు.

ఎన్నికల ప్రక్రియ ఎలా ఉంటుంది?

ఈనెల 16న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల, ఎన్నికల అధికారుల నియామకం జరుగుతుంది. 17నుంచి 26 వరకు సంఘాల వారీగా టెరిటోరియల్ నియోజకవర్గాలను ప్రకటిస్తారు. 26న టెరిటోరియల్ నియోజకవర్గాల జాబితా విడుదల చేస్తారు. వీటిపై ఈనెల 27 నుంచి 28 వరకు అభ్యంతరాలు స్వీకరిస్తారు. 29న అభ్యంతరాలను పరిష్కరిస్తారు. అదే రోజు తుది జాబితా ప్రకటిస్తారు. 30న ప్రాజెక్టు కమిటీలకు నోటిఫికేషన్ విడుదల చేస్తారు. అదే రోజు ఫిర్యాదులపై అప్పీల్స్‌కు జిల్లా కలెక్టర్ కమాండ్ ఏరియా అథారిటి అధికారిని నియమిస్తారు. నవంబరు ఒకటిన ఓటర్ల జాబితాను (భూ హక్కుదారులు) జాబితాను ప్రకటిస్తారు. ఓటర్ల జాబితాను ప్రకటిస్తారు. వీటిపై 6వ తేదీ నుంచి 7వ తేదీ వరకు అభ్యంతరాలు స్వీకరిస్తారు. 8న అభ్యంతరాలను పరిష్కరిస్తారు. ఓటర్లకు సంబంధించిన తుది జాబితాను నవంబరు 8న ప్రకటిస్తారు. వీటిపై ఆర్‌డిఓ వద్ద అప్పీల్‌కు వెళ్లవచ్చు. వారు 11 నుంచి 12 వరకు పరిష్కరిస్తారు. ఆర్‌డివో స్థాయిలో కూడా అప్పీల్స్‌పై సంతృప్తిచెందని వారు నేరుగా కాడా కమిషనర్‌కు ఫిర్యాదు చేయవచ్చు. కాడాకమిషనర్ వద్ద వచ్చేనెల 13 నుంచి 15 వరకు అప్పీల్‌కు వెళ్లవచ్చు. నవంబరు 15న ఎన్నికలకు సంబంధించి నీటి సంఘాలు, డిస్ట్రిబ్యూటరీ కమిటీ, ప్రాజెక్టుకమిటీలకు సంబంధించి తుది నోటిఫికేషన్ విడుదల చేస్తారు. 15వ తేదీన నీటి సంఘాల సభ్యులతో ఎన్నికల అధికారులు సమావేశం నిర్వహించి ఎన్నిక నోటిఫికేషన్ జారీ చేస్తారు. 16న ఎన్నికలు జరుగుతాయి. నీటి సంఘాల అధ్యక్షులుగా ఎన్నికయిన వారు డిస్ట్రిబ్యూటరీ కమిటీని ఎన్నుకుంటారు. 19 నుంచి 21 వరకు డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఎన్నిక జరుగుతుంది. 22 నుంచి 25 మధ్య ప్రాజెక్టు కమిటీ ఎన్నిక జరుగుతుంది. దీంతో ఈప్రక్రియ ముగుస్తుంది.

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ప్రాంతీయ గ్రంథాలయాన్ని సందర్శించిన కేంద్ర మంత్రి పెమ్మసాని

ప్రజాశక్తి-గుంటూరు

పాఠకులతో మాట్లాడుతున్న మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్

కేంద్ర గ్రామీణాభివృద్ధి, సమాచార శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ఆదివారం ఎమ్మెల్యే నసీర్ అహ్మద్‌తో కలిసి ఆంధ్రా క్రైస్తవ కళాశాల ఎదురుగా ఉన్న ప్రభుత్వ ప్రాంతీయ గ్రంధాలయాన్ని సందర్శించారు. గ్రంధాలయంలోని అన్ని విభాగాలను మంత్రి పరిశీలించారు. గ్రంధాలయాల అభివృద్ధి కోసం చేపట్టాల్సిన తక్షణ చర్యలను గ్రంధాలయాధికారి, సిబ్బంది, పాఠకుల్ని అడిగి తెలుసుకున్నారు. ఆయా సమస్యలపై మంత్రి సానుకూలంగా స్పందించారు. గ్రంధాలయాభివృద్ధి కోసం కావాల్సిన అన్ని వసతులను చేకూర్చటానికి తమ వంతు సహకారం అందిస్తానని అన్నారు. కార్యక్రమంలో గ్రంధాలయాధికారి ఎన్.వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

కళల కాణాచికి వన్నెతెచ్చిన నాటకోత్సవాలు

-ముగిసిన వీణ అవార్డ్స్ జాతీయస్థాయి నాటకాలు

ఎడ్ల గోపాలరావుకు సుబ్రహ్మణ్య శాస్త్రి పురస్కారం

ప్రజాశక్తి తెనాలి

కళలకాణాచిగా పేరున్న తెనాలికే వన్నె తెచ్చే విధంగా జాతీయస్థాయిలో నాటకోత్స వాలు నిర్వహించడం అభినందనీయమని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. స్థానిక రామకష్ణ కవి కళాక్షేత్రంలో పట్టణానికి చెందిన కళల కాణాచి, విజయవాడ వేద గంగోత్రి ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 7న ప్రారంభమైన వీణ అవార్డ్స్ జాతీయస్థాయి నాటకోత్సవాలు శనివారం రాత్రి ముగిశాయి. చివరి రోజున వెలగలేరు ఆర్ట్స్ వారి 'హరిలో రంగ హరి' సమకాలీన సాంఘిక పద్య నాటకం, వీరన్నపాలెం కళానికేతన్ వారి 'ఋతువు లేని కాలం' సాంఘిక నాటకాన్ని ప్రదర్శించారు. ఆద్యంతం రస రంజకంగా సాగిన నాటకోత్సవాల ముగింపు సభలో ముఖ్యఅతిథిగా మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు. ప్రముఖ పౌరాణిక రంగస్థల నటులు ఎడ్ల గోపాలరావుకు బుర్ర సుబ్రహ్మణ్య శాస్త్రి జాతీయ రంగస్థల పురస్కారాన్ని ఆలపాటి చేతుల మీదుగా అందించి సత్కరించారు. ఈ సందర్భంగా ఆలపాటి మాట్లాడుతూ సమాజంలో అసమానతలు, సాంఘిక దురాచారాలు, కుల వ్యవక్షపై ప్రజలను చైతన్య పరిచేందుకు నాటక ప్రదర్శనలు దోహదం చేస్తాయన్నారు. రంగస్థల కళా రంగానికి పూర్వవైభవం తీసుకువచ్చేలా నాటక కళాపరిషత్తులు పనిచేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సినీ మాటల రచయిత బుర్రా సాయి మాధవ్, సినీ నటులు గోపరాజు విజయ్, కళల కాణాచి సంస్థ కార్యదర్శి చెరుకుపల్లి సింగారావు, డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, బుర్ర విజయలక్ష్మి, డి భవాని, పలువురు కళాకారులు, వివిధ కళాపరిషత్తుల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉత్తమ సాంఘిక నాటకం బహుమతి పొందిన స్వేచ్ఛ లో దృశ్యం

ఎడ్ల గోపాలరావుకు పురస్కారం అందజేస్తున్న మాజీ మంత్రి ఆలపాటి తదితరులు

నాటకోత్సవాలలో విజేతల వివరాలివే...

ఆద్యంతం ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసి సందేశాత్మకంగా ప్రదర్శించిన నాటకోత్సవాలలో విజేతల వివరాలను నిర్వాహకులు ప్రకటించారు. సాంఘిక నాటక పోటీలలో ఉత్తమ ప్రదర్శనగా హైదరాబాద్ విశ్వశాంతి కల్చరల్ అసోసియేషన్ ప్రదర్శించిన 'స్వేచ్ఛ' నాటకం నిలిచింది. ద్వితీయ ఉత్తమ ప్రదర్శనగా చైతన్య కళ స్రవంతి వారి 'మంత్ర నగరి' నిలిచాయి. అలాగే సాంఘిక నాటిక పోటీలలో ఉత్తమ ప్రదర్శనగా అమరావతి ఆర్ట్స్ గుంటూరు వారి 'చిగురు మేఘం', ఉత్తమ ద్వితీయ ప్రదర్శనగా యువభేరి ఆర్ట్స్ అసోసియేషన్ వారి ప్రదర్శన 'నా శత్రువు', ఉత్తమ తతీయ ప్రదర్శనగా లలిత శ్రీ కళా సమితి శ్రీకాకుళం వారి 'మతమా.. మానవత్వమా' నాటికలు నిలిచాయి. విజేతలకు వీణ అవార్డ్స్ తో పాటు నగదు బహుమతులను అందించి నటీనటులను సత్కరించారు.